మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 30-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 151 Issue: 151

30 నవంబర్ 2025 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:33 సూర్యాస్తమయం - సా. 5:36 తిథి: దశమి రా. 9:23 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర రా. 12:57౦ వరకు తరువాత రేవతి యోగం వజ్ర ఉ. 7:06 వరకు కరణం తైతుల ఉ. 10:24 వరకు గరజి రా. 9:23 వరకు వర్జ్యం ఉ. 11:29 నుండి మ. 1:00 వరకు దుర్ముహూర్తం సా. 4:07 నుండి సా. 4:51 వరకు రాహుకాలం సా. 4:13 నుండి సా. 5:36 వరకు యమగండం మ. 12:04 నుండి మ. 1:27 వరకు గుళికాకాలం మ. 2:50 నుండి సా. 4:13 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:57 నుండి తె. 5:45 వరకు అమృత ఘడియలు రా. 8:36 నుండి రా. 10:07 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:42 నుండి మ. 12:26 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com


# కొండగట్టులో.. భారీ అగ్నిప్రమాదం

**వరుసపెట్టి 10 బొమ్మల షాపులు దగ్ధం**

## జీవనోపాధి కోల్పోయిన కుటుంబాలు.. బోరున విలపిస్తున్న బాధితులు

జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న సన్నిధిలో శనివారం అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. దిగువ కొండగట్టులోని జగిత్యాల-కరీంనగర్ హైవే పక్కన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురుగా ఉన్న సందులోని బొమ్మల షాపులన్నీ కాలిపోయినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో దాదాపు 10 షాపులు ఉన్నట్లు తెలుస్తోంది.



(చిత్రం అందించినవారు:: నక్క అనిల్)



## యాక్టివ్ సిమ్ ఉంటేనే వాట్సాప్

టెలిగ్రామ్, అరట్టైకి కూడా వర్తింపు

కొత్త రూల్ తెచ్చిన టెలికం శాఖ

ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకే

నిబంధనల అమలుకు 90 రోజుల గడువు

న్యూఢిల్లీ: భారత్‌లో వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్, స్నాప్‌చాట్, షేర్‌చాట్, జియోచాట్, అరట్టై వంటి ప్రముఖ మెసేజింగ్ యాప్‌ల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై ఫోన్‌లో యాక్టివ్ సిమ్ కార్డ్ లేకపోతే ఈ యాప్‌లు పనిచేయకుండా నిబంధనలు తీసుకురావాలని కంపెనీలను ఆదేశించింది. దేశంలో సైబర్ మోసాలను అరికట్టే లక్ష్యంతో తీసుకొచ్చిన "టెలికమ్యూనికేషన్ సైబర్ సెక్యూరిటీ సవరణ నిబంధనలు, 2025"లో భాగంగా ఈ



డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా విస్తరిస్తోందో, దానికి అనుగుణంగా సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ప్రతి పౌరుడు స్మార్ట్‌ఫోన్ లేదా ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్న నేపథ్యంలో, సైబర్ నేరగాళ్ల కొత్త పంథాలను ఎంచుకుంటూ అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. కాబట్టి ప్రతి కాల్ పట్ల, ప్రతి మెసేజ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం అలసత్వం వహించినా, సున్నిత సమాచారం షేర్ చేసినా బ్యాంకు ఖాతాలు ఖాళీ పోవడం పక్కా.

## ఆశకు పోయి ఆగం కావొద్దు..

# బకరా కావొద్దు!

ఈజీ మనీ కోసం గెంతులేయొద్దు

బహుమతులంటే లొంగిపోవద్దు

లాభాలు చూపిస్తామంటే నమ్మొద్దు

ఏపీకే ఫైల్స్‌తో తస్మాత్ జాగ్రత్త

భారీగా పెరిగిపోతున్న సైబర్ నేరాలు

హైదరాబాద్, నవంబర్ 30 (ఈవార్తలు): గత కొన్ని నెలలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సైబర్ నేరాలు భారీగా పెరిగిపోయాయి. ఫేడ్‌ఎక్స్ కొరియర్, డ్రగ్స్ కేసు, ట్రేడింగ్ లింకులు, ఓటీపీ మోసాలు, కేవైసీ అప్‌డేట్ పేరుతో బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్న ఘటనలు రోజుకు వందల సంఖ్యలో నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ పోలీసులు ప్రజలకు కొన్ని కీలక సూచనలు జారీ చేశారు. 'మీ పేరుతో అక్రమ కొరియర్ పంపారు, డ్రగ్స్ తరువాయి 2 వ పేజీలో...

### రాపిడో డ్రైవర్ ఖాతాలో 331 కోట్లు

గుజరాత్ నేత ఆదిత్య జులా లగ్జరీ పెళ్లికి రూ. కోటికి పైగా నిధులు

వన్ ఎక్స్ బెట్టింగ్ రాకెట్‌తో సంబంధం ఉన్నట్టు ఈడీ గుర్తింపు

అమాయకుల ఖాతాలను 'మ్యూల్ అకౌంట్లు'గా వాడుతున్న కేటుగాళ్లు

### హాయ్ చెప్పి 14 కోట్లు కొట్టేసింది!

హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం

హైదరాబాద్ వైద్యుడికి సైబర్ కేటుగాళ్ల వల

నకిలీ షేర్ ట్రేడింగ్ పేరుతో 14.61 కోట్ల మోసం

రాష్ట్రంలోనే అతిపెద్ద వ్యక్తిగత సైబర్ మోసంగా గుర్తింపు

# దిత్వా బీభత్సం

## శ్రీలంకలో 123 మంది దుర్మరణం

మరో 130 మంది గల్లంతు.. లంకకు భారత్ ఆపన్న హస్తం

ఆపరేషన్ సాగర్‌బంధుతో రంగంలోకి.. 12 టన్నుల సహాయ సామగ్రి అందజేత



కొలంబో/న్యూఢిల్లీ: శ్రీలంకను 'దిత్వా' తుపాను అతలాకుతలం చేసింది. ఈ తుపాను కారణంగా సంభవించిన భారీ వర్షాలు, వరదలతో ఇప్పటివరకు 123 మంది మరణించగా, మరో 130 మంది గల్లంతయ్యారని విపత్తు నిర్వహణ కేంద్రం ఈరోజు వెల్లడించింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఇళ్లు ధ్వంసం కావడంతో సుమారు 43,995 మందిని ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు తరలించినట్లు డీఎంసీ డైరెక్టర్ జనరల్ సంపత్ కొటువెగోడ తెలిపారు. తుపాను శ్రీలంక తీరం నుంచి భారత్ వైపు కదులుతున్నప్పటికీ, దేశంలో తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా రాజధాని కొలంబో గుండా ప్రవహించే కెలని నది ఉప్పొంగడంతో నదీ తీర తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్): | రూ.12,982 |
| వెండి (గ్రాము): | రూ.192 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,758 |

# రైజింగ్ కోసం 3 వేల డ్రోన్లు

## ఫ్యూచర్ సిటీలో 9న డ్రోన్ షో.. గిన్నిస్ రికార్డు లక్ష్యంగా ఏర్పాట్లు!

భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 9న జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ముగింపు సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పేలా డ్రోన్ షోను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఒకేసారి 3 వేల డ్రోన్లతో ఆకాశంలో 'తెలంగాణ ఈజ్ రైజింగ్.. కమ్, జాయిన్ ది రైజ్' అనే అక్షరాల సమాహారం ఆవిష్కరించేలా డ్రోన్ షో నిర్వహించనున్నారు. ఇప్పటివరకు డ్రోన్లతో ఆకాశంలో అత్యంత పొడవైన వాక్యాన్ని ప్రదర్శించిన రికార్డు యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్ అబుదాబి పేరిట ఉంది.




హైదరాబాద్, నవంబర్ 29 (ఈవార్తలు): 2025 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 2,131 డ్రోన్లతో హ్యాపీ న్యూ ఇయర్ అనే వాక్యాన్ని ప్రదర్శించి ఈ రికార్డును అందుకుంది. అంతకు మించిన సంఖ్యలో డ్రోన్లను ఉపయోగించి గ్లోబల్‌సమ్మిట్ ముగింపు వేడుకల్లో అద్భుతమైన డ్రోన్ షో నిర్వహించనుంది. డ్రోన్ షోతో తెలంగాణ రైజింగ్ నినాదాన్ని గగనతలంలో ప్రదర్శించి ప్రపంచ రికార్డు అధిగమించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. కాగా, వికసిత్ భారత్-2047 జాతీయ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్‌ను తయారు చేసింది. ఆర్థిక వృద్ధి, అన్ని రంగాల ప్రగతి, అన్ని వర్గాల సంక్షేమం, సాధికారత, సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా భవిష్యత్తు తెలంగాణకు రోడ్‌మ్యాప్‌ను



# మేడారానికి జాతీయ హోదా ఇవ్వలేం

ఏ జాతరకూ ఏ హోదా ఇవ్వలేదు

తేల్చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

వరంగల్‌కు ప్రాధాన్యమిస్తున్నామని వెల్లడి

మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించలేమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. దేశంలో ఏ జాతరకు జాతీయ హోదా ఇవ్వలేదన్నారు. శనివారం హనుమకొండలోని సెంట్రల్ ఆర్కాలజీ అధికారుల తో కలిసి వెయ్యి స్తంభాల ఆలయాన్ని సందర్శించారు. అభివృద్ధి పనుల ఆలస్యంపై అసహనం వ్యక్తం చేశారు.

హనుమకొండ, నవంబర్ 29 (ఈవార్తలు): అధికారుల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడిన కిషన్ రెడ్డి.. వరంగల్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. హెరిటేజ్ సిటీ, స్మార్ట్ సిటీకి నిధులు ఇచ్చామన్నారు. వెయ్యి స్తంభాల ఆలయంలో మండపం పునర్నిర్మాణం చేశామని చెప్పారు. భద్రాచలాన్ని రూ.50 కోట్లతో, రామప్పను రూ.150 కోట్లతో

## విశ్వవాణి



కూతుళ్ల కోసం తండ్రులు ఏ త్యాగం చేయడానికైనా సిద్ధంగానే ఉంటారు. వాళ్ల మీద చూపించే ప్రేమ ఆ స్థాయికి చేర్చుతుంది మరి. చైనాలోనూ ఓ తండ్రి తన కూతురి కోసం ఆశ్చర్యపోయే పని చేశాడు. తన కూతురి యూనివర్సిటీ బయట చిన్న ఫుడ్ స్టాల్‌ను పెట్టాడు. దీనికే ఏం గొప్ప.. అనుకుంటున్నారా? ఇక్కడే ఉంది అసలు ట్విస్ట్. తన కూతురికి ఇష్టమైన ఆహారం అందించే ఉద్దేశంతోనే ఈ హెూటల్‌ను పెట్టాడట. పైగా, తన ఉద్యోగానికి రాజీనామా చేసి, 900 కిలోమీటర్లు వచ్చి తన బిడ్డ జిహ్వకు మంచి రుచి అందించడం కోసం ఫుడ్ స్టాల్ పెడ్డటం అంటే విశేషమే కదండోయ్.

# తొలి విలన్ కాంగ్రెస్

తెలంగాణ తల్లిని తీసేసి కాంగ్రెస్ బొమ్మ పెట్టిండ్రు

రాజీవ్ విగ్రహాన్ని తీసేసి తెలంగాణ తల్లి విగ్రహం పెడ్తం

## కేసీఆర్ లేకుంటే తెలంగాణ లేనేలేదు

పీసీసీ చీఫ్‌లు ఉద్యమంలో ఎక్కడున్నరు?: కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 29 (ఈవార్తలు): కేంద్రంలో రాష్ట్రంలో అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీనే స్వయంగా తెలంగాణ ఏర్పాటు ప్రకటన చేస్తూ కేసీఆర్ గారి ప్రాణం ముఖ్యమని దీక్ష విరమించాలని వేడుకుందని

తెలంగాణకు తొలి, శాశ్వత విలన్ కాంగ్రెస్సేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన దీక్షా దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. పీసీసీ అధ్యక్షులు ఉద్యమ కాలంలో ఎక్కడున్నారో ఎవరికీ తెలియదన్నారు. కానీ ఆయన ఈరోజు తెలంగాణ ఉద్యమం గురించి, కేసీఆర్ గారి దీక్ష గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.




# సర్పంచ్ అయ్యేందుకు ఎస్సై రాజీనామా

కోదాడ, నవంబర్ 29 (ఈవార్తలు): గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ సూర్యాపేట జిల్లాలో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఒక ఎస్సై స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఆయన పదవీ కాలం మరో ఐదు నెలలు ఉండగానే ఎన్నికలు రావడంతో, స్వగ్రామంలో పోటీ చేయాలనే ఆకాంక్షతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. కోదాడలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పులి వెంకటేశ్వర్లు తన

# రాశి ఫలాలు

30.11.2025

మేషం: దూరప్రయాణాల వలన శ్రమ అధికమౌతుంది. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందదు. వృథా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఆటుపోట్లు తప్పవు. బంధువులతో అకారణంగా మాట పట్టింపులుంటాయి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు.

వృషభం: గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహారిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు.

మిథునం: ఆరోగ్య పరంగా చికాకులు తప్పవు. వ్యాపారాలలో జాగ్రత్త అవసరం. చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు ఉంటాయి. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఇతరులకు ధనపరంగా మాట ఇవ్వడం మంచిది కాదు. ఉద్యోగమున మీ కష్టం ఫలించదు.

కర్కాటకం: ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలలో ఉత్సాహంగా సాగుతాయి. గృహ నిర్మాణ ప్రయత్నాలలో ముందడుగు వేస్తారు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. దూరపు బంధువుల నుండి అందిన సమాచారం ఊరట కలిగిస్తుంది. స్నేహితులతో వివాదాలు సర్దుబాటు కాగలవు.

సింహం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. వృత్తి ఉద్యోగాలు నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. బంధు మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. ఆదాయం సంతృప్తినిస్తుంది. సోదరులతో శుభాకార్య విషయాలపై  చర్చలు చేస్తారు.

కన్య: దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. నూతన ఋణాలు చేస్తారు. ఇంటా బయట బాధ్యతలు ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక ప్రశాంతత లోపిస్తుంది. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు అధికామౌతాయి.

తుల: చిన్న పాటి అనారోగ్యం సమస్యలు బాధిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. బందు మిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని మార్పులుంటాయి. కొన్ని కార్యక్రమాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. రెండు రకములైన ఆలోచన వలన ధన నష్టాలు తప్పవు.

వృశ్చికం: ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు పొందుతారు.  నూతన వాహనం కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. నూతన కార్యక్రమాలు చేపడతారు. వృత్తి వ్యాపారాలలో మీ అంచనాలు నిజమవుతాయి.

ధనస్సు: వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం కలుగుతుంది. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు సానుకూలమౌతాయి. గృహ నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. చిన్ననాటి స్నేహితుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి.

మకరం: దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. రాబడికి మించి ఖర్చులు పెరుగుతాయి. సోదరులతో ఆస్తి వివాదాలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని ఇబ్బందులుంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు ఫలించవు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

కుంభం: వృత్తి వ్యాపారాలలో అంచనాలు అందుకోవడంలో విఫలమౌతారు. సన్నిహితుల నుండి ఊహించని విమర్శలు ఎదురవుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు మందకోడిగా సాగుతాయి. ఆర్థిక సమస్యలు తప్పవు చేపట్టిన పనులలో కష్టానికి తగ్గ ఫలితం దక్కదు. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు.

మీనం: వ్యాపార విస్తరణకు మిత్రుల సహాయం అందుతుంది. ఆదాయం గతం కంటే మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగాలు ఆశాజకనంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ సేవలకు తగిన గుర్తింపు పొందుతారు. సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారమౌతాయి.

# కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం



(చిత్రం అందించినవారు:: నక్క అనిల్)

మల్యాల, నవంబర్ 29 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న సన్నిధిలో శనివారం అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. దిగువ కొండగట్టులోని జగిత్యాల–కరీంనగర్ హైవే పక్కన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురుగా ఉన్న సందులోని బొమ్మల షాపులన్నీ కాలిపోయినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో దాదాపు 10 షాపులు ఉన్నట్లు తెలుస్తోంది. షార్ట్ సర్క్యూట్ కావడంతో ఈ భారీ ప్రమాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. బొమ్మలన్నీ ప్లాస్టిక్ వస్తువులు, వెదురు బొంగుల పందిళ్లు కావడంతో మంటలు వేగంగా వ్యాపించినట్లు వెల్లడించారు. అందిన సమాచారం మేరకు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఒక్కసారిగా మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. అయితే, జీవనోపాధి కోల్పోవడంతో బాధిత కుటుంబాలు బోరున విలపిస్తున్నాయి. కడుపు నింపే దుకాణం కండ్ల ముందే కాలిపోతోందని కన్నీరుమున్నీరయ్యారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హాయ్ చెప్పి 14 కోట్లు కొట్టేసింది!

- **హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం**
- **హైదరాబాద్ వైద్యుడికి సైబర్ కేటుగాళ్ల వల**
- **నకిలీ షేర్ ట్రేడింగ్ పేరుతో 14.61 కోట్ల మోసం**
- **రాష్ట్రంలోనే అతిపెద్ద వ్యక్తిగత సైబర్ మోసం**

హైదరాబాద్, నవంబర్ 29 (ఈవార్తలు): ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాలు ఏ స్థాయిలో ఉన్నాయో చాటిచెప్పే సంచలన ఉదంతం హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. నకిలీ షేర్ ట్రేడింగ్‌ను నమ్మి ఓ వైద్యుడు ఏకంగా రూ. 14.61 కోట్లు పోగొట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఒకే సైబర్ మోసంలో ఓ వ్యక్తి ఇంత భారీ మొత్తంలో నష్టపోవడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ ఘటనపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. వివరాల్లోకి వెళితే.. ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌కు చెందిన ఓ వైద్యుడికి గత ఆగస్టు 27న ఫేస్‌బుక్ మెసెంజర్‌లో 'మోనికా మాధవన్' అనే పేరుతో ఓ మహిళ పరిచయమైంది. తన వ్యక్తిగత సమస్యలు, విడాకుల కేసు గురించి చెప్పి సానుభూతి పొందింది. ఆ తర్వాత సంభాషణను టెలిగ్రామ్‌కు మార్చి, తాను షేర్ ట్రేడింగ్‌లో నిపుణురాలినని, రోజూ లక్షల్లో సంపాదిస్తున్నానని నమ్మబలికింది. ఆమె మాటలు నమ్మిన వైద్యుడిని, తాను చెప్పిన నకిలీ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేయించి సెప్టెంబర్ 30న తొలి పెట్టుబడిగా రూ. 30 లక్షలు పెట్టించింది. వెంటనే ఆయన వర్చువల్ ఖాతాలో రూ. 8.6 లక్షల లాభం చూపించి, అందులోంచి రూ. 85 వేలు విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో వైద్యుడికి పూర్తి నమ్మకం కుదిరింది. మరింత లాభాల ఆశతో, ఆమె ఒత్తిడి మేరకు బ్యాంకు రుణాలు, స్నేహితుల వద్ద అప్పులు చేసి విడతలవారీగా సుమారు రూ. 14 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టారు. అతడి వర్చువల్ ఖాతాలో బ్యాలెన్స్ రూ. 34 కోట్లుగా చూపించడంతో డబ్బు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించారు. అయితే, పన్నుల కింద రూ. 7.5 కోట్లు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు డిమాండ్ చేశారు. అనుమానం వచ్చిన వైద్యుడు వారిని నిలదీయగా, మోనికా స్పందించడం మానేసింది. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు గురువారం టీజీసీఎస్‌బీని ఆశ్రయించారు.

## బకరా కావొద్దు!

మొదటి పేజీ తరువాయి

పట్టుబడింది' అంటూ భయపెట్టి వీడియో కాల్ చేస్తారు. 'మీ బ్యాంకు అకౌంట్ నుంచి మనీలాండరింగ్ జరిగింది' అంటూ ఫేక్ పోలీస్ వాయిస్ కాల్ చేస్తాడు. 'స్టాక్ మార్కెట్‌లో భారీ లాభాలు' అని టెలిగ్రామ్ గ్రూపుల్లో చేర్చి లక్షలు పెట్టించి మోసం చేస్తున్నారు. కేవైసీ అప్‌డేట్ చేయకపోతే అకౌంట్ బ్లాక్ అవుతుంది అని లింకులు పంపుతున్నారు. అయితే, అది నమ్మదగిన సమాచారం అయితే, అది కూడా ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసుకున్నాకే ముందుకు వెళ్లడం మంచిది.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

- పోలీసులమంటూ డబ్బు కోసం ఫోన్ చేస్తే నమ్మొద్దు
- ఓటీపీ ఎవరికీ షేర్ చేయొద్దు. మీ ఓటీపీ తెలిస్తే ఒక్క నిమిషంలో ఖాతా ఖాళీ అవుతుంది.
- అనుమానాస్పద లింకులు, ఏపీకే ఫైల్స్‌తో జాగ్రత్త
- టెలిగ్రామ్, వాట్సాప్‌లో గ్యారంటీ లాభాలు చూపించే ట్రేడింగ్ గ్రూపుల్లో చేరొద్దు.
- బ్యాంకు నుంచి ఎలాంటి కేవైసీ అప్‌డేట్ కోసం లింక్ రాలేదు. అవసరమైతే మీరే బ్రాంచ్‌కు వెళ్లండి
- ఎవరో తెలియని వ్యక్తులు 'మీ డబ్బు సేఫ్ ఖాతాలో వేయండి' అని చెప్తే 1930 నంబర్‌కు ఫోన్ చేయండి.
- ఫోన్‌లో స్క్రీన్ షేర్ చేయాలని అడిగితే వెంటనే కాల్ కట్ చేయండి.
- మీ బ్యాంకు అకౌంట్, కార్డు వివరాలు ఎవరితోనూ షేర్ చేయొద్దు.
- అనుమానం కలిగితే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయండి.

## రాపిడో డ్రైవర్ ఖాతాలో 331 కోట్లు

- **గుజరాత్ నేత ఆదిత్య జులా లగ్జరీ పెళ్లికి రూ. కోటికి పైగా నిధులు**
- **వన్ ఎక్స్ బెట్టింగ్ రాకెట్‌తో సంబంధం ఉన్నట్టు ఈడీ గుర్తింపు**
- **అమాయకుల ఖాతాలను 'మ్యూల్ అకౌంట్లు'గా వాడుతున్న కేటుగాళ్లు**

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఓ సాధారణ రాపిడో బైక్ డ్రైవర్ బ్యాంకు ఖాతా నుంచి గుజరాత్‌కు చెందిన యువ రాజకీయ నేత ఆదిత్య జులాకు సంబంధించిన లగ్జరీ పెళ్లికి నిధులు అందినట్టు ఈడీ గుర్తించింది. గతేడాది నవంబర్‌లో ఉదయ్‌పూర్‌లోని తాజ్ ఆరావళి రిసార్ట్‌లో ఈ వివాహం జరగ్గా, దీనికి వాడిన నిధుల మూలాలపై ఇప్పుడు తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వన్ ఎక్స్ బెట్టింగ్ అక్రమ బెట్టింగ్ రాకెట్‌పై దర్యాప్తులో భాగంగా ఈడీ ఈ మనీ లాండరింగ్ గుట్టురట్టు చేసింది. 2024 ఆగస్టు నుంచి 2025 ఏప్రిల్ మధ్య కాలంలో ఆ రాపిడో డ్రైవర్ ఖాతాలో ఏకంగా రూ. 331.36 కోట్లు జమ అయినట్లు అధికారులు కనుగొన్నారు. ఈ ఖాతా నుంచి రూ. కోటికి పైగా డబ్బును ఆడంబరమైన పెళ్లి ఖర్చుల కోసం వాడారు. అయితే ఆ డ్రైవర్‌కు వధూవరులతో ఎలాంటి సంబంధం లేకపోవడం గమనార్హం. ఈ ఖాతాను ఒక 'మ్యూల్ అకౌంట్'గా వాడినట్లు ఈడీ భావిస్తోంది. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి డబ్బు డిపాజిట్ అవడం, వచ్చిన వెంటనే ఇతర అనుమానాస్పద ఖాతాలకు బదిలీ కావడం జరిగిపోయింది. ఈ లావాదేవీల జాడను పరిశీలించగా, వాటికి అక్రమ బెట్టింగ్ కార్యకలాపాలతో సంబంధం ఉన్నట్లు తేలింది. అసలు నిధుల మూలాలను దాచిపెట్టేందుకే ఇలా మూడో వ్యక్తి ఖాతాను వాడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అమాయకుల ఖాతాలను ఉపయోగించి నేరాలకు పాల్పడటం ఈ మధ్య కాలంలో పెరిగిపోయిందని, తమకు సంబంధం లేదని భావించి ఖాతా వివరాలు ఇతరులకు ఇచ్చిన వారు తర్వాత తీవ్రమైన చట్టపరమైన చిక్కుల్లో పడుతున్నారని ఓ సీనియర్ ఈడీ అధికారి హెచ్చరించారు.

## యాక్టివ్ సిమ్ ఉంటేనే వాట్సాప్

మొదటి పేజీ తరువాయి

మార్పులు చేశారు. ఈ నిబంధనలను అమలు చేయడానికి యాప్‌లకు 90 రోజుల గడువు విధించారు. కొత్త నిబంధనల ప్రకారం ఈ యాప్‌లు తమ సేవలను వినియోగదారుడి సిమ్ కార్డ్‌తో నిరంతరం అనుసంధానమై ఉండేలా చూసుకోవాలి. అంతేకాకుండా కంప్యూటర్ బ్రౌజర్ల ద్వారా లాగిన్ అయిన వారిని ప్రతి 6 గంటలకు ఒకసారి ఆటోమేటిక్‌గా లాగౌట్ చేయాలని, మళ్లీ క్యూఆర్ కోడ్ ద్వారా ధ్రువీకరించుకున్న తర్వాతే లాగిన్ అవ్వనివ్వాలని టెలికాం శాఖ (డాట్) స్పష్టం చేసింది. దీనివల్ల ప్రతీ సెషన్ యాక్టివ్‌గా ఉన్న సిమ్‌తో ముడిపడి ఉంటుందని, నేరగాళ్లు రిమోట్‌గా యాప్‌లను దుర్వినియోగం చేయడం కష్టమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం యాప్‌ను ఇన్‌స్టాల్ చేసే సమయంలో ఒక్కసారి మొబైల్ నంబర్‌ను ధ్రువీకరించుకుంటే చాలు. ఆ తర్వాత సిమ్ కార్డ్‌ను తీసేసినా లేదా డీయాక్టివేట్ చేసినా యాప్ పనిచేస్తూనే ఉంటుంది. ఈ లొసుగును అడ్డం పెట్టుకుని సైబర్ నేరగాళ్లు, ముఖ్యంగా విదేశాల్లో ఉన్నవారు మోసాలకు పాల్పడుతున్నారని, వారిని గుర్తించడం కష్టంగా మారుతోందని ప్రభుత్వం చెబుతోంది. సిమ్ బైండింగ్ ద్వారా యూజర్, వారి నంబర్, డివైజ్ మధ్య సంబంధాన్ని గుర్తించడం సులభమవుతుందని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అభిప్రాయపడినట్టు 'మీడియానామా' తన కథనంలో పేర్కొంది. ఇప్పటికే బ్యాంకింగ్, యూపీఐ యాప్‌లలో ఇలాంటి భద్రతా ప్రమాణాలు అమలులో ఉన్నాయి. అయితే, ఈ నిబంధనపై నిపుణుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. దీనివల్ల మోసాలు కొంతమేర తగ్గే అవకాశం ఉందని కొందరు అంటుండగా, నకిలీ లేదా దొంగిలించిన ఐడీలతో నేరగాళ్లు సులభంగా కొత్త సిమ్‌లను పొందగలరని, కాబట్టి దీనివల్ల ప్రయోజనం పరిమితమేనని మరికొందరు సైబర్ నిపుణులు వాదిస్తున్నారు. ఏదేమైనా ఈ కొత్త నిబంధన వల్ల యూజర్లకు ఇబ్బందులు తప్పకపోవచ్చు.

## రైజింగ్ కోసం 3 వేల డ్రోన్లు

మొదటి పేజీ తరువాయి

రూపొందించింది. ఈ లక్ష్యాలను ప్రపంచ వేదికపై ప్రదర్శించేందుకు డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025'ను నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరిస్తారు. ఈనెల 13న ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన పాల్గొనే వేడుకలోనే ప్రత్యేక ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహిస్తారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ఇది ప్రత్యేక ఆకర్షణగా, ముగింపు ఘట్టంగా నిలుస్తుంది.

## సర్పంచ్ అయ్యేందుకు ఎస్సై రాజీనామా

మొదటి పేజీ తరువాయి

ఉద్యోగానికి రాజీనామా చేశారు. కోదాడ మండలం పరిధిలోని ఆయన స్వగ్రామం గుడిబండలో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. రాజకీయ పదవుల కోసం ప్రభుత్వ ఉద్యోగులు తమ అవకాశాలను బట్టి రాజీనామాలు చేయడం సాధారణంగా చూస్తుంటాం. ఎంతోమంది ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు సైతం తమ పదవులకు రాజీనామా చేసి, తమకు నచ్చిన రాజకీయ పార్టీలలో చేరి ప్రజా ప్రతినిధులుగా ఎన్నికవుతున్నారు లేదా నామినేటెడ్ పదవులు పొందుతున్నారు. మరికొందరు ఉద్యోగ విరమణ అనంతరం రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్నారు.

# దిత్వా బీభత్సం

మొదటి పేజీ తరువాయి

ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రమే ఈ నది ప్రమాదకర స్థాయికి చేరడంతో వందల మందిని తాత్కాలిక శిబిరాలకు పంపించారు. "సాయుధ బలగాల సహాయంతో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి" అని కొటువెగోడ మీడియాకు వివరించారు.

### అండగా భారత్

దిత్వా తుపాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన పొరుగు దేశం శ్రీలంకకు భారత్ తన సహాయ సహకారాలను విస్తరించింది. 'ఆపరేషన్ సాగర్ బంధు'లో భాగంగా భారత వాయుసేనకు చెందిన సీ–130జే విమానం శనివారం సుమారు 12 టన్నుల సహాయ సామగ్రితో కొలంబోలో ల్యాండ్ అయింది. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. "ఆపరేషన్ సాగర్ బంధు కొనసాగుతోంది. టెంట్లు, టార్పాలిన్లు, దుప్పట్లు, పరిశుభ్రత కిట్లు, తినడానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలతో కూడిన 12 టన్నుల సామగ్రి కొలంబో చేరింది" అని ఆయన తెలిపారు. నిన్న కూడా భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ ఉదయగిరి నౌకల ద్వారా శ్రీలంకకు అత్యవసర సహాయాన్ని అందించారు. ఈ నౌకల ద్వారా 4.5 టన్నుల పొడి రేషన్, 2 టన్నుల తాజా రేషన్‌తో పాటు ఇతర నిత్యావసరాలను బాధితులకు పంపిణీ చేసినట్లు కొలంబోలోని భారత హైకమిషన్ పేర్కొంది. దిత్వా తుపాన్ వల్ల ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. "మా సమీప సముద్ర పొరుగు దేశానికి సంఘీభావంగా అత్యవసర సహాయ సామగ్రిని పంపాము. అవసరమైతే మరింత సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నాం. 'నైబర్‌హుడ్ ఫస్ట్' పాలసీకి కట్టుబడి కష్టకాలంలో శ్రీలంకకు అండగా నిలుస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన 'దిత్వా' తుపాను తీవ్రరూపం దాల్చి దక్షిణ భారత తీరంవైపు దూసుకొస్తోంది. దీని ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలు ఇప్పటికే అతలాకుతలమవుతున్నాయి. తీరం దాటకముందే తుపాను తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో, అధికారులు అప్రమత్తమై ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. చెన్నై సహా పలు ప్రభావిత జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించగా, అనేక విమాన సర్వీసులను రద్దు చేశారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం 'దిత్వా' తుపాను వాయవ్య దిశగా గంటకు 7 కిలోమీటర్ల వేగంతో కదులుతూ, ఉత్తర తమిళనాడు–పుదుచ్చేరి తీరానికి సమీపంలో కేంద్రీకృతమై ఉంది. ఇది రేపు ఉదయానికి తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కారణంగా తమిళనాడులోని కడలూరు, విల్లుపురం, చెంగల్పట్టు జిల్లాలతో పాటు పుదుచ్చేరికి రెడ్ అలర్ట్ జారీ చేశారు. సముద్రం అల్లకల్లోలంగా మారడంతో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పైనా తీవ్రంగా ఉండనుంది. రాబోయే 48 గంటల పాటు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఆదివారం నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా కుండపోత వర్షాలు (20 సెం.మీ. కంటే ఎక్కువ) పడే ప్రమాదం ఉందని తెలిపింది.

## మేడారానికి జాతీయ హోదా ఇవ్వలేం


మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రసాద్ స్కీమ్ లో రామప్ప, భద్రాచలం, జోగులాంబ ఆలయాన్ని డెవలప్‌మెంట్ చేస్తున్నామని తెలిపారు. మేడారం జాతర విషయాన్ని కేంద్ర ట్రైబల్, టూరిజం మంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కాగా, ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘ పౌర్ణమి రోజుల్లో జరుపుతారు. మేడారం జాతరను.. జాతీయ పండుగగా ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి ఇప్పటివరకు చాలాసార్లు ప్రతిపాదనలు వెళ్ళినా ఇంతవరకు జాతీయ హోదా లభించలేదు.

# తొలి విలన్ కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ కథలో ముమ్మాటికి కాంగ్రెస్ విలన్, శాశ్వత శత్రువు కాంగ్రెస్ పార్టీయే అని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ అనే మూడు అక్షరాలు లేకుంటే తెలంగాణ లేదు అన్నది సత్యం అన్నారు. హీరోలు మౌనంగా ఉంటే విలన్లు తామే హీరోలమని ఫోజులు కొడతారని అన్నారు. అందుకే ఉద్యమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరూ ఆనాటి ఉద్యమ ఘట్టాలను దీక్షా దివస్ ప్రాధాన్యతను మరోసారి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత సోనియా గాంధీకి ధన్యవాదాలు చెప్పిన సంస్కారం బీఆర్ఎస్‌ది అని, సీఎం రేవంత్ రెడ్డి మాదిరిగా తెలంగాణ బలిదేవత సోనియా గాంధీ అని తాము ఏనాడు అనలేదని కేటీఆర్ గుర్తుచేశారు. మమ్మల్ని అవమానపరిస్తే ఊరుకుంటాం కానీ తెలంగాణను ఉద్యమాన్ని అవమానపరిస్తే ఊరుకునేది లేదన్నారు. 60 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో ప్రతిసారి తెలంగాణను ముంచింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. 1950 నుంచి 2025 వరకు తెలంగాణ తొలి శత్రువు విలన్ కాంగ్రెస్ పార్టీనే అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆనాటి నుంచి ఈనాటి దాకా తెలంగాణ ప్రజా ప్రతినిధులను పార్టీలో కలుపుకొని మోసం చేస్తున్నది కాంగ్రెస్ పార్టీనే అని ఆరోపించారు. దమ్ముంటే చేర్చుకున్న పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని కేటీఆర్ కాంగ్రెస్ పార్టీకి సవాల్ విసిరారు. తెలంగాణ ప్రజలు ఉద్యమాల కోసం నిలబడిన వీరులని, 60 ఏళ్ల పాటు బానిసలుగా ఉన్నది కాంగ్రెస్ పార్టీ నాయకులే అన్నారు. తల్లి తెలంగాణను తీసివేసి కాంగ్రెస్ బొమ్మను పెట్టుకున్నది కాంగ్రెస్ బానిసలే అన్నారు. సచివాలయం ముందున్న రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తీసివేసి తల్లి తెలంగాణ విగ్రహం బరాబర్ పెడతాము అని కేటీఆర్ ప్రకటించారు. ఎన్నో యుగాలు దాటిన తర్వాత కూడా రామాయణ, మహాభారతంలోని హీరోలు విలన్లు ఈనాటి తరానికి గుర్తు ఉన్నారంటే అది కేవలం గత చరిత్రను పదే పదే మననం చేసుకోవడం వల్లనే అని కేటీఆర్ అన్నారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన దశాబ్దాల చరిత్రను, అందులోని విలన్లను, హీరోలను, పోరాట వీరులను, వారి త్యాగాలను గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. మన చరిత్రను మనమే తెలుసుకోకుంటే, హీరోల స్థానంలో విలన్లే హీరోలమంటూ చరిత్రను వక్రీకరిస్తారన్నారు. దోపిడీ, వివక్ష, కన్నీళ్లలో మగ్గిపోయిన తెలంగాణ ఆ బానిస సంకెళ్ళను తెంచుకున్న పోరాట కథను, దాని కథానాయకుడు కేసీఆర్ గారి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. స్వతంత్ర సంగ్రామ పోరాటంలో సిపాయిల తిరుగుబాటు, జలియన్వాలా బాగ్ వంటి ముఖ్య ఘట్టాలు ఉన్నట్లే తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంలోనూ అపూర్వమైన ఘట్టాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.



# భట్టి పీపీటీ తప్పుల తడక

## పొంతనలేని విద్యుత్తు గణాంకాలు.. శాఖపై అవగాహన లేని మంత్రి.. మాజీమంత్రి హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్, నవంబర్ 29 (ఈవార్తలు): డిప్యూటీ సీఎం భట్టి పీపీటీ ప్రజెంటేషన్ పై బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు కౌంటర్ వేశారు. విద్యుత్ పై అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసిన స్టేట్ పవర్ సెక్టార్ శ్వేతపత్రం, ఇటీవల విడుదల చేసిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025, తాజా పీపీటీలో ప్రదర్శించిన విద్యుత్ గణాంకాలు ఒక దానికి మరొకటి పొంతన లేకుండా ఉందన్నారు. డిప్యూటీ సీఎంగా, విద్యుత్ మంత్రిగా రెండేళ్లు పూర్తయినప్పటికీ.. ఆ శాఖలోని విషయాలపై ఏమాత్రం అవగాహన లేకుండా ఇతరులను అన్‌ఫిట్ ఫర్ పాలిటిక్స్ అని కామెంట్ చేయడం తగునా? అని భట్టిని హరీశ్ ప్రశ్నించారు. అధికారులు ఒక్కోసారి ఒక్కోలెక్కలను మీ ద్వారా ప్రదర్శింపజేస్తున్నా అది తెలియడం లేదా అని వివరించారు. ప్రభుత్వానికి కమీషన్లపై ఉన్న శ్రద్ధ, పాలసీలపై ఉండి ఉంటే.. ఈ పొరపాట్లు జరగేవి కాదని ఎద్దేవా చేశారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం లేదని, పునర్విభజన చట్టం ప్రకారం అందుబాటులో ఉన్న ఎన్టీపీసీ 1600 మెగావాట్ల విద్యుత్‌ను పక్కన పెట్టి, భారీ స్కాం లక్ష్యంతో 2400 మెగావాట్ల కొత్త థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణానికి తొందరపడుతోందని ఆరోపించారు. 2025 ఎనర్జీ పాలసీలో 2034%-%35 నాటికి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి 16,966 మెగావాట్లు లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం, ఇప్పుడు అకస్మాత్తుగా 5,000%-%6,000 మెగావాట్ల లోటు ఉందని చెప్పడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పాలసీలోనే ప్రస్తుతం 14,164 మెగావాట్ల థర్మల్ జనరేషన్ అందుబాటులో ఉందని పేర్కొనగా, అంచనా ప్రకారం గరిష్టంగా 2,802 మెగావాట్ల లోటే ఉండాలి కానీ%ా% ఇప్పుడు చెప్పే లెక్క ఎలా వచ్చిందని భట్టి విక్రమార్కపై నిప్పులు చెరిగారు. '2030 నాటికి 20,000 మెగావాట్ల పునరుత్పాదక శక్తి ఉత్పత్తి చేస్తామని గ్రీన్ ఎనర్జీ పాలసీలో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. అంటే రాబోయే ఐదేళ్లలో 13,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీని సాధించాల్సి ఉంటుంది. అలా ఉండగా, ఎందుకు థర్మల్ ప్లాంట్లపై ఇంత తొందర, క్యాబినెట్ ఏ ఆధారంపై నిర్ణయం తీసుకుందో ప్రభుత్వం వివరణ చెప్పాలి. 2400 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ల నిర్మాణానికి ఆమోదించిన 50 వేల కోట్లలో 30%-%40 శాతం కమిషన్ లక్ష్యమే అసలు కారణమా?' అని హరీశ్ రావు మండిపడ్డారు. అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలు, శ్వేతపత్రంలో ఉన్న వివరాలకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు కోసం కోల్ ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు వత్సరానికి రూ.803 కోట్లు అవుతుందని శ్వేతపత్రంలో చెప్పి%ా% ఇప్పుడు 1600 కోట్లు అవుతాయని చెప్పడం



ప్రజలను తప్పుదోవ పట్టించటమేనని విమర్శించారు. ఒకప్పుడు యాదాద్రి ప్రాజెక్టును తప్పుబట్టిన కాంగ్రెస్ నాయకులే ఇప్పుడు మక్తల్ వద్ద 800 మెగావాట్ల థర్మల్ ప్లాంటు ఏర్పాటు చేస్తామని చెప్పడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మక్తల్‌లో థర్మల్, సోలార్, విండ్.. ఏది ఏర్పాటు చేయాలన్నది ఇంకా పరిశీలనలో ఉందని భట్టి విక్రమార్క చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఇటీవల మంత్రులే మక్తల్‌లో థర్మల్ ప్లాంటు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఏది నిజం? ఏది అబద్ధం? అని ప్రశ్నిస్తూ ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావాలని కోరారు. యాదాద్రి ప్రాజెక్టు పర్ మెగావాట్ ఖర్చు 8.64 కోట్లు కాగా, ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో 7.63 కోట్లు ఖర్చవుతుందని శ్వేతపత్రంలో పేర్కొన్నారని హరీశ్ రావు గుర్తు చేశారు. ఎన్టీపీసీ ఫేజ్2లో 3ల800 మెగావాట్ల ప్లాంటు 2023 డిసెంబర్ 1 నాటికి కూడా ప్రారంభం కాలేదని మీరు శ్వేతపత్రంలోనే ప్రకటించారని, ఇప్పుడు బీఆర్ఎస్‌ను నిందించడం ఏమిటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే 800 మెగావాట్ల అగ్రిమెంట్ చేసుకొని, మిగతా 1600 మెగావాట్లు అక్కర్లేదని చెప్పిన విషయం నిజమా? అబద్ధమా? అని నిలదీశారు. రామగుండం కొత్త ప్లాంటులో పర్ మెగావాట్ ఖర్చు 14 కోట్లు అవుతుందని ప్రభుత్వం స్వయంగా ప్రకటించగా, ఎన్టీపీసీ మాత్రం 12.3 కోట్లకే ప్లాంట్లు నిర్మిస్తోందని, ఈ భారీ వ్యత్యాసానికి కారణం ఏమిటి అని ప్రశ్నించకుండా, డీపీఆర్ ఇంకా సిద్ధం కాలేదంటూ తప్పించుకోవడం సరైంది కాదన్నారు. మహిళా సంఘాలకు 1,000 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లు అప్పగిస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనల పురోగతి గురించి ప్రశ్నించగా, ప్రభుత్వం ఏ సమాధానమూ ఇవ్వకుండా ప్రతిపక్షాలపై ఆరోపణలు మాత్రమే చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న మంత్రులు ప్రజలను తప్పుదోవ పట్టించే ధోరణిని వెంటనే మార్చుకోవాలని హరీశ్ రావు హితవు పలికారు.

## ఐబొమ్మ అంటే ఇంటర్నెట్ బొమ్మ

**అర్థం చెప్పిన ఇమ్మంది రవి.. ముగిసిన రెండో విడత కస్టడీ**





హైదరాబాద్, నవంబర్ 29 (ఈవార్తలు): పైరసీ వెబ్‌సైట్లు 'ఐబొమ్మ', 'బప్పం'ల పేర్లు ఎందుకు పెట్టారనే విషయాన్ని ఐ-బొమ్మ రవి విచారణలో వెల్లడించాడు. ఐ-బొమ్మ రవిని అరెస్టు చేసిన పోలీసులు మొదట ఐదు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించారు. ఈ కేసులో మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి అతడిని మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరగా, నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం అంగీకరించింది. అతడి రెండో విడత కస్టడీ నేటితో ముగిసింది. పోలీసుల విచారణలో అతడు పలు ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. ఐ-బొమ్మ పూర్తి పేరు ఇంటర్నెట్ బొమ్మ అని తెలిపాడు. విశాఖలో సినిమాను బొమ్మ అని పిలిచేవారని అందుకే ఆ పేరు పెట్టినట్లు చెప్పాడు. మరో పైరసీ వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలనుకున్నప్పటికీ, డొమైన్‌లో సాంకేతిక సమస్య కారణంగా 'ఎల్' అక్షరాన్ని తొలగించి 'బప్పం'గా మార్చినట్లు వెల్లడించాడు. ఐ-బొమ్మ రవి రెండో విడత కస్టడీ ఈరోజుతో ముగిసింది. ఇందులో భాగంగా పోలీసులు అతడిని మూడు రోజుల పాటు ప్రశ్నించి, కీలక విషయాలను రాబట్టారు. పైరసీకి సంబంధించిన అడ్వాన్స్‌డ్ సాంకేతికత గురించి పోలీసులకు రవి వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాలు టెలిగ్రామ్ నుండి తీసుకున్నవేనని చెప్పాడు. కస్టడీ ముగియడంతో పోలీసులు అతడిని కోర్టులో హాజరుపరిచారు.

## నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అల్లు అర్హ

హైదరాబాద్, నవంబర్ 29 (ఈవార్తలు): ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గారాలపట్టి అల్లు అర్హ చిన్న వయసులోనే అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. యంగెస్ట్ చెస్ ట్రైనర్‌గా అసాధారణ ప్రతిభ కనబరిచి నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. ఈ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే, అల్లు అర్హ 30 చెస్ పజిల్స్‌ను పరిష్కరించడంలో ఏకంగా 50 మంది విద్యార్థులకు విజయవంతంగా శిక్షణ ఇచ్చింది. ఇంత చిన్న వయసులో ఆమె ప్రదర్శించిన ఈ నైపుణ్యానికి గుర్తింపుగా ఈ రికార్డు దక్కింది. అల్లు అర్జున్ తరచూ పంచుకునే క్యూట్ వీడియోలతో అర్హ ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితురాలైంది. గతంలో 'శాకుంతలం' సినిమాలో బాలనటిగా అరంగేట్రం చేసి తన నటనతో, స్పష్టమైన తెలుగు ఉచ్ఛారణతో ప్రేక్షకులను, విమర్శకులను ఆకట్టుకుంది. ఇప్పుడు చదువుతో పాటు చదరంగంలోనూ అద్భుత ప్రతిభ కనబరుస్తుండటంతో ఆమెపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తండ్రికి తగ్గ కూతురని, అల్లు అర్జున్ స్ఫూర్తిని అర్హ కొనసాగిస్తోందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## సీఎం రేవంత్‌తో శుభలేఖ సుధాకర్ భేటీ



హైదరాబాద్, నవంబర్ 29 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ సినీ నటుడు శుభలేఖ సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 15న రవీంద్ర భారతి ఆవరణలో దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. రవీంద్ర భారతి ఆవరణలో విగ్రహ ఏర్పాటుకు అనుమతించినందుకు ఎస్పీ బాలు కుటుంబం తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. గాయకుడు బాలసుబ్రహ్మణ్యం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ తదితర భాషల్లో సుమారు 40 వేలకు పైగా పాటలు పాడి శ్రోతల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. అంతేకాకుండా పలు తెలుగు, తమిళ చిత్రాల్లో నటించి మెప్పించారు. సినిమాల్లోనే కాకుండా టీవీ రంగంలో ఆయన పాడుతా తీయగా, పాడాలని ఉంది లాంటి కార్యక్రమాలను నిర్వహించి ఎంతోమంది నూతన గాయనీ, గాయకులను వెలుగులోకి తెచ్చారు. ఆయన 2020 సెప్టెంబర్ 25న కన్నుమూశారు.

## పవన్.. ప్యాకేజీ స్టార్

**70 ఏళ్లైనా సీఎం కాలేడు**

**జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 29 (ఈవార్తలు): తెలంగాణ నాయకుల దిష్టి తగలడం వల్లే గోదావరి జిల్లాల్లో కొబ్బరిచెట్లు ఎండిపోతున్నాయన్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నేత, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. పవన్ కల్యాణ్‌కు 70 ఏళ్లు వచ్చినా ముఖ్యమంత్రి కాలేరని, ఆయన ఒక ప్యాకేజీ స్టార్ అని విమర్శించారు. తమ దిష్టి తగిలితే పవన్ కల్యాణ్ గెలిచేవారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే తెలుగుదేశం పార్టీని వదిలి ఒంటరిగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. తెలంగాణ నాయకుల నరదిష్టి తగిలినందుకే కోనసీమ జిల్లాలో కొబ్బరి చెట్లు మొండెం లేకుండా అయ్యాయని పవన్ కల్యాణ్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. అదే నిజమైతే, ఇతరులు బాగుపడవద్దనే ఉద్దేశం తెలంగాణ వారికి ఉంటే ఆంధ్ర వాళ్లు హైదరాబాద్, తెలంగాణలో వ్యాపారాలు చేసుకునేవారా అని ప్రశ్నించారు. నీటిపారుదల, నిర్మాణం సహా వివిధ రంగాల్లో ఆంధ్ర వాళ్లు ఉన్నారని, తాము ఒక్క మాట కూడా అనడం లేదని అన్నారు. పవన్ కల్యాణ్ ఇష్టానుసారం మాట్లాడితే ఊరుకునేది లేదని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్కు ఉప ముఖ్యమంత్రి అయ్యేవారా అన్నారు. ఆయన ఉండేది, వ్యాపారం చేసుకునేది మాత్రం తెలంగాణలోనే అని గుర్తుంచుకోవాలని అన్నారు. తెలంగాణ నాయకులది నరదిష్టి అయితే ఆయన హైదరాబాద్‌లో ఆస్తులు ఎందుకు కొనుగోలు చేశారని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ తెలంగాణలో ఉన్న ఆస్తులను అమ్ముకుని విజయవాడలో ఉండాలని సవాల్ చేశారు. తాను కూడా పవన్ కల్యాణ్ అభిమానినేనని, అందుకే ఆయన ఓజీ సినిమా ఫ్లాప్ అయినా నిర్మాత నష్టపోకూడదనే ఉద్దేశంతో రూ.800 పెట్టి టిక్కెట్ కొనుగోలు చేశానని అన్నారు.

## దీక్షాదివస్ పేరుతో నాటకాలు: సీతక్క

హైదరాబాద్, నవంబర్ 29 (ఈవార్తలు): బీఆర్ఎస్ చేపట్టిన దీక్షా దివస్‌పై తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ నిర్వహించేవారని, అధికారం కోల్పోయిన తర్వాత ఇప్పుడు పది రోజుల పాటు ఆ పేరుతో నాటకాలు ఆడుతున్నారని ఆమె దుయ్యబట్టారు. పదేళ్లలో ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమిటో ఈ దీక్షా దివస్‌లో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రజలకు ఎంతో చేసిందని అన్నారు. ఈవిజయాలను ప్రజలకు వివరించేందుకు తాము పది రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వీటిని అడ్డుకునే కుట్రతోనే బీఆర్ఎస్ దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతోందని ఆమె మండిపడ్డారు. తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ధి పొందింది కేసీఆర్ కుటుంబమేనని ఆమె ఆరోపించారు. ఆ పార్టీ దగ్గర ప్రస్తుతం అధికారం మాత్రమే లేదని, కానీ కోట్లాది రూపాయలు ఉన్నాయని ఆమె ఆరోపించారు. లేకపోతే బయటకే రావొద్దని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారని ఆమె విమర్శించారు. దీక్షా దివస్ పేరుతో బీఆర్ఎస్ చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరని ఆమె స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో సీఐటీ

## సంచలన కేసుల విచారణకు కొత్త టీం.. ఏర్పాటు చేసిన సీపీ సజ్జనార్

హైదరాబాద్, నవంబర్ 29 (ఈవార్తలు): హైదరాబాద్ పోలీసు శాఖ దర్యాప్తు ప్రక్రియను మరింత పటిష్టం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకోనుంది. నగరంలో సంచలనం సృష్టించే, కీలకమైన కేసుల విచారణ కోసం ప్రత్యేకంగా సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సీఐటీ)ను ఏర్పాటు చేసేందుకు పోలీస్ కమిషనర్ సజ్జనార్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ కొత్త బృందం ఏర్పాటుతో ముఖ్యమైన కేసుల దర్యాప్తు వేగవంతం అవుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అన్ని రకాల కేసులను స్థానిక పోలీస్ స్టేషన్లు, ఇతర విభాగాలు దర్యాప్తు చేస్తున్నాయి. అయితే, సీఐటీ ఏర్పాటు ద్వారా సాధారణ కేసులతో సంబంధం లేకుండా కేవలం సంచలనాత్మక కేసులపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించే అవకాశం ఉంటుంది. ఇది దర్యాప్తులో జాప్యాన్ని నివారించి, నాణ్యతను పెంచుతుందని పోలీసు శాఖ అంచనా వేస్తోంది. ఈ సీఐటీ బృందం బాధ్యతలు కేవలం దర్యాప్తుకే పరిమితం కావు. కేసు నమోదు దగ్గర నుంచి ఆధారాల సేకరణ, కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయడం, ఆ తర్వాత కేసు విచారణ (ట్రయల్) ప్రక్రియను కూడా ఈ టీమ్ నిశితంగా పర్యవేక్షిస్తుంది. కేసు మొదటి దశ నుంచి తుది తీర్పు వెలువడే వరకు పూర్తి బాధ్యత వహించేలా సీఐటీ విధివిధానాలను రూపొందిస్తున్నారు. ఈ నిర్ణయంతో కీలక కేసుల్లో దోషులకు త్వరగా శిక్ష పడేలా చేయవచ్చని అధికారులు ఆశిస్తున్నారు.



**నిర్లక్ష్యం వహిస్తే వేటేస్తా**

విధి నిర్వహణలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని, సస్పెన్షన్ వేటు వేయడానికి కూడా వెనుకాడబోమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సిబ్బందిని గట్టిగా హెచ్చరించారు. పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటేనే సమాజంలో అసాంఘిక శక్తులు అదుపులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కమిషనరేట్‌లో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులను పక్కన పెట్టడం లేదా నేర తీవ్రతను తగ్గించి చూపడం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. నగరంలో జరిగే కీలకమైన కేసుల దర్యాప్తును పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక 'సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీమ్' ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల ఫైళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా డ్రగ్స్, ఆన్‌లైన్ గేమింగ్‌పై ఉక్కుపాదం మోపాలని సూచించారు. సైబర్ క్రైమ్, మహిళల భద్రత, వీధి నేరాలు, ఆహార కల్తీ వంటి కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో పలువురు అడిషనల్ సీపీలు, డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

### గ్రిడ్ కుప్పకూలితే..


# రోజూ 2000 కోట్ల నష్టం

**విద్యుత్తు అవసరాలకు భారీ ప్రణాళికలు**

**దేశంతో పోటీపడేలా బలమైన పునాదులు**

**పీపీటీ ప్రజంటేషన్‌లో డిప్యూటీ సీఎం భట్టి**

హైదరాబాద్, నవంబర్ 29 (ఈవార్తలు): భవిష్యత్తులో రాష్ట్ర జీఎస్డీపీని పెంచేందుకు అవసరమైన చర్యలను సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కేబినెట్, ప్రజాప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మీడియా సమావేశంలో వెల్లడించారు. తెలంగాణ ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు పెద్ద ఎత్తున ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆయన చెప్పారు. ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చేసిన దేశాలతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించేందుకు బలమైన పునాదులు వేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించే లక్ష్యంతో ముందుకు వెళుతున్న దశలో అందుకు అనుగుణంగా విద్యుత్తు ప్రణాళికలను తయారు చేశామన్నారు. ఉత్పత్తి రంగాలు పెద్ద ఎత్తున అభివృద్ధి చెందితేనే వాటి ద్వారా ఉత్పత్తి భారీ స్థాయిలో పెరిగి రాష్ట్ర జిఎస్డిపి కి ఉపయోగపడతాయి. తద్వారా మన ఎకానమీ ఆశించిన స్థాయిలో పెరుగుతుందని ఆయన అన్నారు. ఉత్పత్తి రంగాలైన తయారీ, వ్యవసాయ, సేవల రంగాలకు అవసరమైన నాణ్యమైన విద్యుత్ ను అందించడమే ప్రధానాశంగా ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడే విధంగా తెలంగాణ అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నాం. ప్రపంచంలోని వివిధ దేశాలలో తలసరి విద్యుత్ వినియోగానికి అనుగుణంగా తెలంగాణలో కూడా తలసరి విద్యుత్ వినియోగం పెంచడానికి ఆలోచన చేస్తూ ముందుకు వెళుతున్నట్లు చెప్పారు.



రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో కంటే ఒకేసారి 10 శాతం విద్యుత్ డిమాండ్ పెరిగిందని భట్టి విక్రమార్క వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబులు దావోస్ వెళ్లి వివిధ సంస్థలతో ఎంవోలు చేసుకోవడం విదితమే. అందులో భాగంగా రాష్ట్రంలో ఏర్పాటు కానున్న డేటా, గ్లోబల్ సెంటర్స్ తో హైదరాబాద్ గ్లోబల్ హబ్ గా మారనుంది. అంతేకాక మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు.

**3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం**

రాష్ట్ర ప్రభుత్వం 2047కు 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అవసరమైన ఖచ్చితమైన ప్రణాళికతో ముందుకు పోతోంది. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జీఎస్డీపీ 13 శాతం పెరగాలి. జీఎస్డీపీ పెరగాలంటే అదే స్థాయిలో విద్యుత్తు వినియోగం పెరుగుదల ప్రతి ఏటా10 శాతం ఉంటుందని అంచనాలున్నాయి. ఆ లెక్కన 2047 నాటికి 1,39,310 మెగావాట్లకు పైగా విద్యుత్ అవసరం ఏర్పడుతుంది. ఈ స్థాయిలో విద్యుత్ పెరుగుదల అవసరం ఉండగా ప్రస్తుతం మన రాష్ట్రంలో మన రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 20,754 మెగావాట్లుగా ఉందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం 2014లో పవర్ డిమాండ్ 6,755 మెగావాట్లు ఉండేది. 2025 నాటికి 17,162 కు పెరిగింది. 2025-26 నాటికి 18,825 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉంది. అదే 2035 నాటికి 48,827 మెగావాట్లకు పెరుగుతుందనే అంచనాలున్నాయి. 2025 నుంచి ప్రతి ఏటా 8.50 శాతం పెరుగుదలతో.. 2047 నాటికి ప్రతి ఏటా 10 శాతం మేర గ్రోత్ రేట్ ఉండవచ్చనే అంచనాలున్నాయని చెప్పారు. భవిష్యత్తులో విద్యుత్ డిమాండ్ అవసరాలు ఈ విధంగా ఉండగా ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 20,754 మెగావాట్లుగా ఉంది. కాబట్టి 2047 లక్ష్యానికి చేరుకునేందుకు విద్యుత్తు ఉత్పత్తిని పెంచుకోవాలన్నారు. విద్యుత్ వినియోగంలో 2030 నాటికి 50 శాతం గ్రీన్ ఎనర్జీనే ఉండాలని పారిస్ ఒప్పందం చెబుతోంది. 2070 నాటికి పూర్తిగా గ్రీన్ ఎనర్జీనే వినియోగించాలనే అందులో స్పష్టంగా ఉంది. గత పదేళ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం విద్యుత్తు పాలసీ తీసుకురాకపోవడం వల్ల సోలార్, థర్మల్, విండ్, పంప్డ్ స్టోరేజీలలో మనం వెనుకబడి ఉన్నామని చెప్పారు. సీఈఏ ప్రకారం 2029-30 నాటికి రాష్ట్రం మైనస్ 243 మిలియన్ యూనిట్లకు వెళుతుందని చెప్పారు. 2029-30 నాటికి విద్యుత్ స్టోరేజీ 7366 మెగావాట్లు అవసరమని.. సోలార్ పవర్ కొనుగోలు చేయాలంటే 25 ఏళ్ల అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికైనా విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని చెప్పారు. విద్యుత్‌ను బ్యాటరీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు.

## సోషల్ వాణి



### కీర్తిశిఖరం నా భారతం

గెలిచి నిలిచింది వీరత్వం.. ఎదురు తిరిగింది పౌరుషం
ఏకమై కదిలింది భారతం.. గాంధీ గగన ధార భారతం
సర్దార్ సమర స్ఫూర్తి భారతం
అంబేద్కర్ ఆశయ సాధన భారతం
భగత్ సింగ్ పిడికిలి నా భారతం
అల్లూరి ఆత్మార్పణం నా భారతం
విస్ఫోట జ్వాలని రగిల్చింది భారతం
భవితకి నాంది అయ్యింది భారతం
బ్రతుకుకి బాసట అయ్యింది భారతం
నేను చూస్తున్న భారతం - నువ్వు ఎదిగిన భారతం
నాలుగు గోడలకి పరిమితం అయిన యువత
స్త్రీని చూడగానే శీలం గుర్తొచ్చే శిఖండి మానవత్వం
కష్టం చేతకాక అర్ధాంగిని హింసించే పైశాచికం
నా దేశంలో అర్ధాకలికి ఏడిచే నాదుడి కంటే నలుసంత
సైతం కదలలేని రాతికే సర్వాంగపూజలు చేస్తారు
మానవత్వం నిలిచిన వేళ..సైన్యాన్ని గుర్తించిన వేళ
సేద్యాన్ని గౌరవించిన వేళ..సాటి మనిషికి అండగా నిలిచిన
వేళ భారతం బాగుంటుంది భవిత బాగుంటుంది
నా ఈ భావాలని పలికే స్వేచ్ఛనిచ్చిన
నాటి స్వాతంత్ర ఉద్యమ కారులకి ధన్యవాదములు తెలుపుతూ
జై భారత్...జై హింద్..

- కానుకుర్తి సాయికిరణ్,
మహబూబాబాద్, 9849418482



## ఏఆర్ఎస్సైకి ఎస్పీ ఘన వీడ్కోలు

జగిత్యాల టౌన్, నవంబర్ 29 (ఈవార్తలు): పోలీస్ శాఖలో గత 40 సంవత్సరాలుగా విధులు నిర్వహించి పదవి విరమణ చేసిన ఏఆర్ఎస్సై రాజేశ్వర్‌కు జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో.. రాజేశ్వర్‌కు ఎస్పీ పూలమాల వేసి శాలువగా సన్మానించారు. సుదీర్ఘ కాలంపాటు పోలీస్ శాఖలో విధులు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు కిరణ్ కుమార్, వేణు, సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.



## భీమన్న గుడిలో ఈవో తనిఖీలు

వేములవాడ, నవంబర్ 29 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ, దృశ్య సౌకర్యాలపై ఆలయ ఈవో రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రారంభించిన సేవా టికెట్లు, క్యూలైన్లు, భక్తుల కోసం ఏర్పాటు చేసిన పలు సౌకర్యాలను పరిశీలిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఆలయ ఇన్స్పెక్టర్ ఎడ్ల శివ సాయి, ఎస్పీఎఫ్ సిబ్బంది, ఆలయ ఉద్యోగులు ఉన్నారు. అటు.. తిప్పాపురం గోశాలను తనిఖీ చేశారు.గోశాలలో గోవులకు అందిస్తున్న పశుగ్రాసం, మెడిసిన్లు, వాటి ఆరోగ్య పరిస్థితి వంటి వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. చలికాలంలో గోవులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఈవో రమాదేవి ఆదేశాలు జారీ చేశారు.

## రేపే విశాఖ గ్లాస్ బ్రిడ్జి ప్రారంభం

వైజాగ్, నవంబర్ 29 (ఈవార్తలు): విశాఖ నగరవాసులు, పర్యాటకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కైలాసగిరి గ్లాస్ బ్రిడ్జి (గాజు వంతెన) ఎట్టకేలకు ప్రారంభానికి సిద్ధమైంది. డిసెంబర్ 1వ తేదీన ఈ వంతెనను అధికారికంగా ప్రారంభించి, అదే రోజు నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ వంతెనను ఎంపీ ఎం. శ్రీభరత్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభిస్తారని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ తెలిపారు. వీఎంఆర్డీఏ, ఆర్‌జే అడ్వెంచర్స్ సంస్థలు సంయుక్తంగా రూ. 7 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టాయి. పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించడమే లక్ష్యంగా దీన్ని నిర్మించారు. 50 మీటర్ల పొడవుతో నిర్మించిన ఈ గాజు వంతెన, దేశంలోనే అత్యంత పొడవైన గ్లాస్ బ్రిడ్జిగా నిలవనుంది. ఇప్పటివరకు కేరళలోని 40 మీటర్ల వంతెన పేరిట ఈ రికార్డు ఉండేది. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, పలుమార్లు క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే దీనికి అనుమతులు ఇచ్చారు. బ్రిడ్జిపై ప్రవేశ రుసుమును ఇంకా ఖరారు చేయలేదని, ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ప్రణవ్‌గోపాల్ వివరించారు. ఈ బ్రిడ్జి నిర్మాణంలో జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న 40 ఎంఎం మందం గల లామినేటెడ్ గాజును ఉపయోగించారు. ఇది ఒకేసారి 500 టన్నుల భారాన్ని మోయగలదు. గంటకు 250 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినా తట్టుకునేలా పటిష్ఠంగా నిర్మించారు. భద్రతా కారణాల దృష్ట్యా, ఒకేసారి 40 మంది పర్యాటకులను మాత్రమే బ్రిడ్జిపైకి అనుమతిస్తారు. వంతెనపై నుంచి చుట్టూ ఉన్న కొండలు, లోయ, సముద్రపు అందాలు వీక్షించడం పర్యాటకులకు థ్రిల్లింగ్ అనుభవాన్ని ఇస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు.

# చంద్రబాబు రియల్ ఎస్టేట్ మాఫియా

**ఏపీ సీఎంపై షర్మిల మండిపాటు**



విజయవాడ, నవంబర్ 29 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యంగా ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. అమరావతి రాజధాని కోసం రెండో విడత భూసేకరణ చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతూ, ఇది రియల్ ఎస్టేట్ మాఫియాను తలపిస్తోందని ఆరోపించారు. "మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె కావాలా?" అన్నట్లుగా చంద్రబాబు తీరు ఉందని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. తొలి విడతలో ప్రభుత్వ భూములతో కలిపి 54 వేల ఎకరాల్లో అభివృద్ధి జరిగిపోయిందని చంద్రబాబు భ్రమల్లో ఉన్నారు. రైతుల నుంచి తీసుకున్న 34 వేల ఎకరాల్లో ఒక్క కిలోమీటర్ నిర్మాణం కూడా జరగలేదని, ఐకానిక్ భవనాల ఊసే లేదని విమర్శించారు. అలాంటిది ఇప్పుడు కొత్తగా మరో 16 వేల ఎకరాలు ఎందుకని నిలదీశారు. అదానీ, అంబానీలకు బాకీ పడ్డారని భూములు సేకరిస్తున్నారా అని సూటిగా ప్రశ్నించారు. దేశంలోని అతిపెద్ద విమానాశ్రయాలు, అంతర్జాతీయ క్రీడా నగరాలతో పోలుస్తూ అమరావతికి వేల ఎకరాలు ఎందుకని షర్మిల అనుమానం వ్యక్తం చేశారు. ముంబై విమానాశ్రయానికి 1850 ఎకరాలు, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు 2200 ఎకరాలు సరిపోయినప్పుడు, అమరావతికి 5 వేల ఎకరాలు అవసరమా అని అడిగారు. బీజింగ్, లండన్ ఒలింపిక్స్ స్పోర్ట్స్ సిటీలు 150 ఎకరాల్లోనే ఉండగా, ఇక్కడ 2500 ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. రాజధాని భూములపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అనుమానాలను నివృత్తి చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. రెండో విడత భూసేకరణను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణం విభజన హామీలో భాగమని, అది కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి రాష్ట్రానికి వచ్చినప్పుడు నిధులు అడగకుండా శాలువాలు కప్పి సన్మానాలు చేయడం ఏంటని ఆమె ప్రభుత్వాన్ని విమర్శించారు.

# శబరిమల యాత్రలో జగన్ బ్యానర్లు

**హిందూ సంఘాల ఆగ్రహం**





పెందుర్తి/వైజాగ్, నవంబర్ 29 (ఈవార్తలు): అయ్యప్ప స్వామి దీక్షను భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. 41 రోజుల పాటు కఠోర నియమాలతో మణికంఠుడిని ఆరాధిస్తారు. అయితే, ఈ పవిత్రమైన దీక్షలోనూ కొందరు రాజకీయ భక్తిని ప్రదర్శిస్తూ వివాదాలకు కారణమవుతున్నారు. తాజాగా విశాఖ జిల్లా పెందుర్తికి చెందిన వైసీపీ నేతలు శబరిమల యాత్రలో జగన్ ఫొటోలతో బ్యానర్లు ప్రదర్శించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. పెందుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు అయ్యప్ప మాల ధరించి శబరిమలకు బయల్దేరారు. ఈ యాత్రలో వారు జగన్, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఇతర స్థానిక నేతల ఫొటోలతో కూడిన మూడు ఫ్లెక్సీలను ప్రదర్శించారు. 'జగన్ 2.0' అంటూ రాసి ఉన్న బ్యానర్లతో 'జై జగన్' అని నినాదాలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇలాంటి ఘటన జరగడం ఇది మొదటిసారి కాదు. కొన్ని రోజుల క్రితం అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన వైసీపీ అయ్యప్ప స్వాములు కూడా ఇదే విధంగా జగన్ బ్యానర్లు ప్రదర్శించి, నినాదాలు చేశారు. ఆ ఘటన మరువక ముందే మరోసారి పెందుర్తిలో పునరావృతం కావడం గమనార్హం. పవిత్రమైన శబరి యాత్రలో రాజకీయ నేతల ఫొటోలు, ఫ్లెక్సీలతో హడావుడి చేయడంపై అయ్యప్ప భక్తులు, హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. భక్తితో చేయాల్సిన యాత్రను రాజకీయ ప్రచారానికి వాడుకోవడం సరికాదని మండిపడుతున్నాయి. ఇలాంటి చర్యలను అరికట్టాలని వారు కోరుతున్నారు.

# మళ్లీ అధ్యక్ష బరిలో ట్రంప్?

**'ట్రంప్ 2028' అంటూ ఏఐ ఫొటో పోస్ట్ చేసిన ట్రంప్**

**మూడోసారి పోటీపై ఊహాగానాలకు తెరలేపిన వైనం**

**అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణపై చర్చ**



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. "ట్రంప్ 2028, యస్!" అని రాసి ఉన్న ఒక నీలిరంగు బోర్డును పట్టుకుని నిలబడినట్లు ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సృష్టించిన ఫొటోను ఆయన షేర్ చేశారు. దీనికి "ట్రంప్లికన్స్!" (ట్రంప్ ం రిపబ్లికన్స్) అని క్యాప్షన్ జోడించారు. ఈ పోస్ట్‌తో అమెరికా అధ్యక్షులను రెండుసార్లకు మించి పోటీ చేయకుండా నిరోధించే 22వ రాజ్యాంగ సవరణపై మరోసారి చర్చ మొదలైంది. 2025 జనవరి 20న రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ తన "అమెరికా ఫస్ట్ 2.0" ఎజెండాను ముందుకు తీసుకెళ్తున్నారు. వలసలపై కఠిన ఆంక్షలు, ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాలపై అధిక టారిఫ్‌లు వంటి విధానాలను అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'ట్రంప్ 2028' అనే నినాదం పదేపదే తెరపైకి వస్తోంది. గత సెప్టెంబర్‌లో డెమొక్రాటిక్ నేతలతో జరిగిన సమావేశంలో కూడా తన డెస్క్‌పై 'ట్రంప్ 2028' టోపీలను ఉంచి ఫొటోలు పోస్ట్ చేశారు. అయితే, ట్రంప్ కేవలం సరదాగా అందరినీ ఆటపట్టిస్తున్నారని, రాజ్యాంగ పరిమితుల గురించి ఆయనకు తెలుసని హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్ వ్యాఖ్యానించారు. గత నెలలో ట్రంప్ కూడా "నిబంధనల ప్రకారం నేను మళ్లీ పోటీ చేయలేను. ఇది చాలా బాధాకరం" అని స్వయంగా చెప్పడం గమనార్హం. ఇదిలా ఉంటే.. 2028 రిపబ్లికన్ అభ్యర్థిత్వ రేసులో ట్రంప్ పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ప్రజాదరణ పెంచుకుంటున్నారు. వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌కు ఆయన గట్టి పోటీ ఇస్తున్నారు. ఆగస్టులో వాన్స్‌కు 36 శాతం, ట్రంప్ జూనియర్‌కు 16 శాతం మద్దతు ఉండగా, నవంబర్ నాటికి వాన్స్ మద్దతు 34 శాతానికి తగ్గగా, ట్రంప్ జూనియర్ మద్దతు 24 శాతానికి పెరిగింది. దీంతో ఇరువురి మధ్య అంతరం కేవలం 10 పాయింట్లకు తగ్గింది.



## విశాఖ కేజీహెచ్‌లో అగ్ని ప్రమాదం

వైజాగ్, నవంబర్ 29 (ఈవార్తలు): విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో పెను ప్రమాదం తృటిలో తప్పింది. గుండె జబ్బుల చికిత్సా విభాగంలో శనివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సిబ్బంది వెంటనే అప్రమత్తం కావడంతో రోగులంతా సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే, గుండె జబ్బుల విభాగానికి చెందిన ఆఫీస్ రూమ్‌లోని ఏసీ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వార్డు మొత్తం దట్టమైన పొగలు అలుముకోవడంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పొగ కారణంగా కొందరు ఊపిరాడక ఇబ్బంది పడ్డారు. ప్రమాదాన్ని గమనించిన ఆసుపత్రి సిబ్బంది వెంటనే స్పందించి అగ్నిమాపక విభాగానికి సమాచారం అందించారు. అదే సమయంలో వార్డులో చికిత్స పొందుతున్న 45 మంది రోగులను హుటాహుటిన వేరొక బ్లాక్‌కు సురక్షితంగా తరలించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ ఈ విషయాన్ని ధృవీకరించారు. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఏసీలో షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ముప్పు తప్పిందని రోగులు, వైద్యులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, కేజీహెచ్‌లో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతుండటంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# విమాన కంట్రోల్స్‌పై సౌర రేడియేషన్ దెబ్బ



న్యూఢిల్లీ: దేశంలోని ప్రముఖ విమానయాన సంస్థలు ఇండిగో, ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు తీవ్ర అంతరాయం కలగనుంది. ఈ సంస్థలు వినియోగిస్తున్న ఎయిర్‌బస్ ఏ320 ఫ్యామిలీ విమానాల్లోని ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్‌లో ఒక సంభావ్య సమస్యను గుర్తించడంతో, దానిని సరిదిద్దేందుకు దేశవ్యాప్తంగా దాదాపు 200 నుంచి 250 విమానాలను తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. తీవ్రమైన సౌర రేడియేషన్ కారణంగా ఏ320 విమానాల్లోని కీలకమైన ఫ్లైట్ కంట్రోల్ డేటా దెబ్బతినే ప్రమాదం ఉందని విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్ శుక్రవారం వెల్లడించింది. ఈ సమస్యను పరిష్కరించడానికి సాఫ్ట్‌వేర్ మార్పులు లేదా హార్డ్‌వేర్ అమరిక అవసరమని, దీనివల్ల విమాన సర్వీసులపై ప్రభావం పడుతుందని తెలిపింది. దేశంలో ఈ కేటగిరీకి చెందిన సుమారు 560 విమానాలు ఉండగా, వాటిలో 250 వరకు విమానాలకు ఈ మార్పులు అవసరమని సంబంధిత వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ సమస్య ఉన్న విమానాల్లోని ఎలివేటర్ ఐలరాన్ కంప్యూటర్‌ను వెంటనే మార్చాలని లేదా సరిచేయాలని యూరోపియన్ యూనియన్ ఏవియేషన్ సేఫ్టీ ఏజెన్సీ ఆదేశాలు జారీ చేసింది. ప్రతి విమానం తదుపరి సర్వీసు ప్రారంభించేలోపే ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ విషయంపై ఇండిగో స్పందించింది. ఎయిర్‌బస్ సూచనల మేరకు అవసరమైన తనిఖీలు చేపడుతున్నామని, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపింది. తమ ఫ్లీట్‌లోని కొన్ని విమానాల్లో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ మార్పులు చేయాల్సి ఉందని, దీనివల్ల సర్వీసులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ కూడా ధ్రువీకరించాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 31 విమానాలపై ఈ ప్రభావం పడనుంది. ప్రయాణికుల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని, ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని ఎయిర్‌బస్ ఒక ప్రకటనలో పేర్కొంది.



## ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్

**ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలి**

**జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

కోరుట్ల/జగిత్యాల, నవంబర్ 29 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ముగింపు సందర్భంగా కోరుట్ల మండలం యూసుఫ్ నగర్ గ్రామం, మెట్‌పల్లి మండలంలోని మేడిపెల్లి, బండలింగాపూర్, వెల్లుల్ల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రిజర్వేషన్ల వివరాలు నోటీస్ బోర్డుపై సక్రమంగా ప్రదర్శించారా? లేదా? అన్నది పరిశీలించారు. ఎన్ని నామినేషన్లు స్వీకరించారు? ఎంత మంది నామినేషన్ల ఫారాలు తీసుకున్నారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. నామినేషన్లకు సంబంధించి నివేదికలను జిల్లా కేంద్రానికి సకాలంలో పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట కోరుట్ల, మెట్పల్లి ఆర్డీవోలు జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఏపీకి కొత్త సీఎస్‌గా సాయిప్రసాద్

**2026 మార్చి నుంచి బాధ్యతలు**

అమరావతి, నవంబర్ 29 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి జి.సాయిప్రసాద్ నియమితులయ్యారు. ఆయన 2026 మార్చి 1వ తేదీ నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పదవీకాలాన్ని ప్రభుత్వం మరో మూడు నెలల పాటు పొడిగించింది. దీనితో ఆయన 2026 మార్చి 28 వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ పొడిగింపునకు సంబంధించి జీవో నంబర్ 2230ను ప్రభుత్వం విడుదల చేసింది. మరోవైపు రాష్ట్రంలో పది మంది డిప్యూటీ కలెక్టర్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ కూడా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో ఆర్టీ నెంబర్ 2228ను ప్రస్తుత సీఎస్ విజయానంద్ విడుదల చేశారు. పరిపాలనాపరమైన ఈ మార్పులపై ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులను జారీ చేయడంతో స్పష్టత వచ్చింది.

## అమరావతి అంతులేని కథ

**చంద్రబాబుపై అంబటి ఫైర్**

తాడేపల్లి, నవంబర్ 29 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విస్తరణ కోసం ప్రభుత్వం మరోసారి భూసేకరణకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు చేశారు. అమరావతి కథ ఒక అంతులేని కథలా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతిలో భూముల ధరలు పడిపోయాయని వ్యాఖ్యానించారు. రాజధాని పేరుతో చంద్రబాబు ప్రజలను మభ్యపెడుతూ దోచుకుంటున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు. ఇప్పటికే రాజధాని కోసం రైతులు 35 వేల ఎకరాల భూములు త్యాగం చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వ భూములతో కలిపి మొత్తం 50 వేల ఎకరాలతో ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నిర్మిస్తానని గతంలో చంద్రబాబు ప్రగల్భాలు పలికారని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ భూసేకరణకు ఎందుకు సిద్ధమవుతున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల అమరావతి రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని అంబటి ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణంపై స్పష్టత ఇవ్వకుండా, పదేపదే భూసేకరణ అనడం రైతులను ఇబ్బందులకు గురి చేయడమేనని ఆయన అన్నారు. ప్రభుత్వ తీరుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

## టీటీడీ కల్తీ నెయ్యి సరఫరాలో మరో 11 మంది పాత్ర

**కేసు విచారణను వేగవంతం చేసిన సిట్ అధికారులు**

తిరుమల, నవంబర్ 29 (ఈవార్తలు): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కు కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసు విచారణను స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) వేగవంతం చేసింది. ఈ కేసులో తాజాగా మరో 11 మందిని నిందితులుగా చేర్చింది. ఈ మేరకు నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ మెమో దాఖలు చేసింది. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రభుత్వం సిట్ కు అప్పగించిన విషయం విదితమే. ఈ కేసులో తొలుత 15 మందిని, ఆ తర్వాత 9 మందిని నిందితులుగా పేర్కొంది. ప్రస్తుతం ఈ కేసులో మొత్తం 35 మందిపై కేసు నమోదు చేసి, పది మందిని అరెస్టు చేసింది. నిందితుల్లో ఏడుగురు టీటీడీ ఉద్యోగులు ఉండడం గమనార్హం. 2019-2024 మధ్య టీటీడీ కొనుగోలు విభాగంలో పనిచేసిన జీఎంలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను ఈ కేసులో చేర్చింది. సిట్ నిందితుల జాబితాలో గతంలో టీటీడీలో జీఎంగా పనిచేసిన జగదీశ్వర్ రెడ్డి, మురళీకృష్ణ, ఎస్వీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఏపీ మంత్రి గుమ్మిడి పీఏ సస్పెండ్

అమరావతి, నవంబర్ 29 (ఈవార్తలు): ఏపీ గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వద్ద అనధికార పీఏగా పనిచేస్తున్న సతీష్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) తీవ్రంగా స్పందించింది. అతడిని తక్షణమే ఆ బాధ్యతల నుంచి తొలగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ సతీష్ విధుల్లో కొనసాగడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన ఓ మహిళ, మంత్రి పీఏ సతీష్ తనను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం సీఎంవో దృష్టికి వెళ్లడంతో అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. సతీష్‌పై కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే సమయంలో, ఈ వ్యవహారంలో రెండు వైపులా విచారణ జరపాలని సీఎంవో సూచించడం గమనార్హం. మహిళ చేసిన ఆరోపణల్లో నిజానిజాలు తేల్చేందుకు సమగ్ర విచారణ చేపట్టాలని పేర్కొంది. ఒకవేళ ఆమె ఆరోపణలు అవాస్తవమని విచారణలో తేలితే, ఆమెపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సీఎం కార్యాలయం స్పష్టం చేసింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతోంది.

## ఘోర రోడ్డు ప్రమాదం .. ఐదుగురు మృతి

ఎమ్మిగనూరు/కర్నూలు, నవంబర్ 29 (ఈవార్తలు): ఏపీలోని కర్నూలు జిల్లాలో శనివారం ఒక ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని కొటేకల్ గ్రామం వద్ద ప్రధాన రహదారిపై రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో చిన్నారులతో సహా ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే, ఎమ్మిగనూరు ప్రధాన రహదారిపై వేగంగా ప్రయాణిస్తున్న రెండు కార్లు అదుపు తప్పి ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ప్రమాద తీవ్రతకు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ఘటనలో ఐదుగురు దుర్మరణం చెందగా, మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల వివరాలు ఇంకా తెలియరాలేదు.

# డాక్టర్ షాహీన్‌కు మూడు పెళ్లిళ్లు

**మూడో భర్త ద్వారా ఉగ్రవాదంలోకి**

న్యూఢిల్లీ: ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన పేలుళ్ల కేసులో ప్రధాన నిందితురాలిగా 46 ఏళ్ల మహిళా డాక్టర్ షాహీన్ సయీద్ పేరు బయటకు రావడం సంచలనం సృష్టిస్తోంది. ఒక వైద్యురాలు, రెండు విఫలమైన వివాహాలు, కొత్తగా దొరికిన ప్రేమ.. చివరికి ఆమెను ఉగ్రవాదం వైపు ఎలా నడిపించాయో దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. దర్యాప్తు వర్గాల సమాచారం ప్రకారం ఢిల్లీ పేలుళ్ల కేసులో నిందితుడిగా ఉన్న మరో డాక్టర్ ముజమ్మిల్ షకీల్‌ను షాహీన్ 2023 సెప్టెంబర్‌లో వివాహం చేసుకుంది. ఈ బంధమే ఆమెను ఉగ్రవాద ప్రపంచంలోకి లాగిందని అధికారులు భావిస్తున్నారు. లక్నోలో విద్యావంతుల కుటుంబంలో పుట్టిన షాహీన్, అలహాబాద్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఫార్మకాలజీలో స్పెషలైజేషన్ చేసింది. 2003లో ఆమె నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ జాఫర్ హయత్‌ను వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అయితే, 2012లో వారు విడిపోయారు. "ఆమె చాలా ప్రేమగల వ్యక్తి. తన పిల్లలన్నా, కుటుంబమన్నా ఎంతో ఇష్టం. అలాంటి వ్యక్తి ఇలాంటి పనుల్లో ఉ ందని నేను అస్సలు ఊహించలేను" అని ఆమె మాజీ భర్త హయత్ ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. విడాకుల తర్వాత ఒంటరితనానికి గురైన షాహీన్, తన ఉద్యోగాన్ని కూడా మానేశారు. ఆ తర్వాత ఘజియాబాద్‌కు చెందిన ఓ వ్యాపారిని రెండో వివాహం చేసుకున్నా అది కూడా ఎక్కువ కాలం నిలవలేదు. ఈ క్రమంలోనే హర్యానాలోని అల్-ఫలాహ్ యూనివర్సిటీలో తన జూనియర్ అయిన కశ్మీరీ డాక్టర్ ముజమ్మిల్ షకీల్ ఆమె జీవితంలోకి ప్రవేశించాడు. వీరి పరిచయం పెళ్లికి దారితీసింది. ఈ సమయంలోనే జైషే మహ్మద్ మహిళా విభాగం 'జమాత్ ఉల్-మోమినాత్' సభ్యులు ఆమెను సంప్రదించి, ఉగ్రవాద భావజాలం వైపు మళ్లించినట్లు ఏజెన్సీలు గుర్తించాయి. పాకిస్థాన్‌లో మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వంలోని ఈ విభాగానికి ఇండియాలో షాహీన్‌ను హెడ్‌గా నియమించినట్లు ఆరోపణలున్నాయి. ఆమె ప్రమేయంపై కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. "నా కుమార్తె ఇలాంటి చర్యలకు పాల్పడిందని నేను నమ్మలేకపోతున్నాను" అని ఆమె తండ్రి సయ్యద్ అహ్మద్ అన్సారీ ఆవేదన వ్యక్తం చేసినట్లు ఐఏఎన్ఎస్ వార్తా సంస్థ పేర్కొంది. ఈ కేసులో షాహీన్, ఆమె భర్త ముజమ్మిల్ షకీల్‌తో పాటు మరో డాక్టర్ అదీల్ అహ్మద్‌ను అధికారులు అరెస్ట్ చేశారు. ఎర్రకోట వద్ద జరిగిన పేలుళ్లలో 15 మంది మృతిచెందిన విషయం తెలిసిందే.

## బీహార్ ఓటమికి నేనూ బాధ్యుడినే: రాహుల్



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయంపై కాంగ్రెస్ పార్టీలో అంతర్మథనం మొదలైంది. ఈ ఓటమికి రాష్ట్ర నాయకత్వంతో పాటు తాను కూడా సమాన బాధ్యత వహిస్తానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకరినొకరు నిందించుకోవడం మానేసి భవిష్యత్తుపై దృష్టి సారించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి కృష్ణ అల్లవారపు, పీసీసీ అధ్యక్షుడు రాజేశ్‌కుమార్ వంటి సీనియర్ నేతల సమక్షంలో ఈ సమీక్ష జరిగింది. దాదాపు నాలుగు గంటల పాటు సాగిన ఈ సమావేశం అనంతరం కాంగ్రెస్ నేతలు ఓటమికి గల కారణాలను బహిరంగంగా వెల్లడించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను అడ్డుపెట్టుకుని ఓట్ల దొంగతనం చేశారని ఆరోపించారు. సమావేశంలో కొందరు అభ్యర్థులు రాష్ట్ర యూనిట్‌లో సమన్వయ లోపం, స్టార్ క్యాంపెయినర్ల కొరత వంటి అంశాలను ప్రస్తావించినా, రాహుల్ గాంధీ మాత్రం ఈ అంశాలను పక్కనపెట్టారు. మన సంస్థాగత బలహీనతే ఓటమికి కారణమైతే, బలమైన నిర్మాణం ఉన్న ఆర్జేడీ, వామపక్షాలు ఎందుకు ఓడిపోయాయని ప్రశ్నించారు. సమావేశం ముగిశాక కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ద్వారా ఓటర్లను లక్ష్యంగా చేసుకుని తొలగించారని, పోలింగ్ కేంద్రాల్లోనూ నగదు పంపిణీ చేశారని ఆరోపించారు. ఎన్నికల సంఘం తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీహార్‌లో తాము పోటీ చేసిన 61 స్థానాల్లో కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకున్నామని, ఈ తీర్పును అంగీకరించబోమని స్పష్టం చేశారు.

# ఇంకొంత కాలం వెయిటింగ్!

**డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు.. సిద్ధరామయ్యతో బ్రేక్ ఫాస్ట్ భేటీ**



బెంగళూరు: అధిష్ఠానం సూచనల మేరకు డీకే శివకుమార్, తాను బ్రేక్‌ఫాస్ట్ భేటీలో పాల్గొన్నామని, కానీ ఏ విషయంపై చర్చించలేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. ఇరువురు నేతలు కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, ఇకముందు కూడా ఉండబోవని స్పష్టం చేశారు. కేసీ వేణుగోపాల్ సూచనల మేరకు బ్రేక్‌ఫాస్ట్ భేటీలో పాల్గొన్నామని అన్నారు. కానీ ఏ విషయంపై చర్చించలేదని ఆయన వ్యాఖ్యానించారు. నెల రోజుల ముందు నుంచి అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకు ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందని ఆయన వెల్లడించారు. బీజేపీ, జేడీఎస్ పార్టీలు తమపై అసత్య ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తాను, డీకే శివకుమార్ ఉమ్మడిగా ఎదుర్కొంటున్నామని అన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైన ప్రధానంగా దృష్టి సారించిందని అన్నారు. 2028లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. అనంతరం డీకే శివకుమార్ మాట్లాడుతూ కర్ణాటక ప్రజల మద్దతుతో రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం తాను సిద్ధరామయ్యతో కలిసి పని చేస్తానని స్పష్టం చేశారు. తాము పార్టీకి విశ్వాసపాత్రులైన సైనికుల్లా పని చేస్తున్నామని అన్నారు. అధిష్ఠానం ఏం చెప్పినా మేమంతా అనుసరిస్తామని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. నాయకత్వం విషయంలోనూ అధిష్ఠానానిదే తుది నిర్ణయం అన్నారు. పార్టీ పెద్దలు తనను ఇంతకాలం వేచి ఉండమని చెప్పారని, అందుకే వేచి చూశానని, ఇంకొంతకాలం కూడా వేచి ఉండటానికి సిద్ధమేనని స్పష్టం చేశారు.

# హెరాల్డ్ చార్జిషీట్ కేసు వాయిదా

**డిసెంబర్ 16కు వాయిదా వేసిన కోర్టు**

**నిందితులుగా సోనియా, రాహుల్ గాంధీ**

**2,000 కోట్ల ఆస్తుల అక్రమ బదలాయింపు?**



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నిందితులుగా ఉన్న నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ కోర్టు కీలక నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును (ఛార్జ్‌షీట్) విచారణకు స్వీకరించాలా? వద్దా? అనే అంశంపై తన నిర్ణయాన్ని డిసెంబర్ 16కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే ఈరోజు తీర్పు వెలువరిస్తారని భావించినప్పటికీ, దానిని వాయిదా వేశారు. గతంలో ఈడీ సమర్పించిన అదనపు ఆధారాలు, పత్రాలను కోర్టు పరిశీలించిన నేపథ్యంలో ఈ నెల 7న తీర్పును రిజర్వ్ చేసింది. లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, నిధుల ప్రవాహం, అద్దె రసీదులను మరింత లోతుగా పరిశీలించాల్సి ఉందని కోర్టు భావిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రచురణకర్త అయిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ. 2,000 కోట్లకు పైగా విలువైన ఆస్తులను కేవలం రూ. 50 లక్షల నామమాత్రపు చెల్లింపుతో కాంగ్రెస్ నేతలు అక్రమంగా చేజిక్కించుకున్నారని ఈడీ ఆరోపిస్తోంది. యంగ్ ఇండియన్ సంస్థ ద్వారా ఈ కుట్ర జరిగిందని, అందులో సోనియా, రాహుల్ గాంధీలకు మెజారిటీ వాటాలు ఉన్నాయని ఈడీ తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ కేసులో సోనియా, రాహుల్‌తో పాటు కాంగ్రెస్ నేతలు శామ్ పిత్రోడా, సుమన్ దూబే తదితరులను మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద నిందితులుగా చేర్చారు. అయితే, కాంగ్రెస్ నేతలు ఈ ఆరోపణలను కొట్టిపారేశారు. 2012లో బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి చేసిన ఫిర్యాదుతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. డిసెంబర్ 16న కోర్టు వెలువరించబోయే నిర్ణయంతో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

## భారత్‌తో సైనిక ఒప్పందానికి

# రష్యా ఆమోదం!

**పుతిన్ పర్యటనకు ముందే కీలక నిర్ణయం**



మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు సిద్ధమవుతున్న వేళ మాస్కో ఒక కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తో కుదుర్చుకున్న సైనిక సహకార ఒప్పందాన్ని రష్యా పార్లమెంట్‌లో ఆమోదించేందుకు రంగం సిద్ధమైంది. పుతిన్ పర్యటనకు కొన్ని రోజుల ముందే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఏడాది ప్రారంభంలో రక్షణ రంగంలో సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఇరు దేశాల మధ్య ఈ ఒప్పందం కుదిరింది. మాస్కోలో జరిగిన కార్యక్రమంలో రష్యా రక్షణ మంత్రి అలెగ్జాండర్ ఫోమిన్, ఆ దేశంలో భారత రాయబారి వినయ్ కుమార్‌లు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇప్పుడు దీనికి చట్టబద్ధత కల్పిస్తూ రష్యా పార్లమెంట్ ఆమోదముద్ర వేయనుంది. దీంతో ఇరు దేశాల మధ్య సైనిక బంధం మరింత బలోపేతం కానుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు డిసెంబర్ 4, 5 తేదీల్లో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికారికంగా ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా పుతిన్, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన గౌరవార్థం ప్రత్యేక విందు ఏర్పాటు చేయనున్నారు. ఈ భేటీ సందర్భంగా ఇరు దేశాల మధ్య మరిన్ని కీలక ఒప్పందాలు జరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**అజెండాలో కీలక అంశాలు ఇవే..**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్ 4, 5 తేదీల్లో భారత పర్యటన చేస్తారని, 23వ భారత-రష్యా వార్షిక సదస్సులో పాల్గొంటారని భారత విదేశాంగ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్ మధ్య కీలక చర్చలు జరగనున్నాయి. గత ఏడాది మాస్కోలో జరిగిన సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ పర్యటనలో ఇరు దేశాల మధ్య రక్షణ, ఇంధనం, వాణిజ్య సంబంధాలపై ప్రధానంగా చర్చించనున్నారు. ముఖ్యంగా, రష్యా నుంచి అందాల్సిన %హా%-400 గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థల డెలివరీలో జరుగుతున్న జాప్యంపై భారత్ దృష్టి సారించనుంది. ఇప్పటికే మూడు స్క్వాడ్రన్లు అందగా, మిగిలిన రెండు వచ్చే ఏడాది మధ్యలోగా అందాల్సి ఉంది. ఈ జాప్యంపై పుతిన్ పర్యటనలో స్పష్టత కోరతామని రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు. సుఖోయ్ విమానాల అప్‌గ్రేడేషన్‌తో పాటు ఇతర రక్షణ ప్రాజెక్టుల ఆలస్యంపైనా చర్చించనున్నారు. అంతేకాకుండా, రష్యా నుంచి రెండు స్క్వాడ్రన్ల సుఖోయ్ %ాబ%-57 ఫైటర్ జెట్ల కొనుగోలు అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించడంతో, ముడి చమురుపై అదనపు డిస్కౌంట్లు ఇచ్చేందుకు రష్యా ముందుకొచ్చింది. ఈ అంశంపైనా చర్చలు జరగనున్నాయి. రెండు దేశాల మధ్య 'ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరింత బలోపేతం చేసేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. పుతిన్ గౌరవార్థం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విందు ఇవ్వనున్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందు, 2021 డిసెంబర్‌లో పుతిన్ చివరిసారిగా భారత్‌లో పర్యటించారు.

## చిరుత కోసం బోను.. చిక్కుకున్న తాగుబోతు



లక్నో: చిరుతపులిని పట్టుకోవడానికి అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో ఓ వ్యక్తి చిక్కుకుపోయిన వింత సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లాలో జరిగింది. ఎరగా కట్టిన మేకను దొంగిలించే ప్రయత్నంలో మద్యం మత్తులో ఉన్న ఆ వ్యక్తి దాదాపు రెండు గంటల పాటు బోనులోనే బందీగా ఉ న్నాడు. ఫఖర్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉమ్రి దెహలో గ్రామంలో రెండు రోజుల క్రితం చిరుత దాడిలో శాంతి దేవి (55) అనే వృద్ధురాలు మరణించింది. దీంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు, ఆ చిరుతను పట్టుకోవడానికి గ్రామానికి సమీపంలో ఒక బోనును ఏర్పాటు చేసి, అందులో మేకను ఎరగా కట్టారు. గురువారం రాత్రి ప్రదీప్ (45) అనే స్థానిక వ్యక్తి మద్యం మత్తులో ఆ బోను వద్దకు వచ్చాడు. మేకను దొంగిలించే ఉద్దేశంతో లోపలికి వెళ్లగా ఆటోమేటిక్ డోర్ ఒక్కసారిగా మూసుకుపోయింది. దీంతో అతను మేకతో పాటు లోపలే చిక్కుకుపోయాడు. ఎంత ప్రయత్నించినా బయటకు రాలేక, తన మొబైల్ ఫోన్ ద్వారా గ్రామస్థులకు ఫోన్ చేసి సహాయం కోరాడు. సమాచారం అందుకున్న గ్రామస్థులు, అటవీ శాఖ అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతన్ని సురక్షితంగా బయటకు తీశారు. విచారణలో "బోను సరిగ్గా పనిచేస్తుందో లేదో తనిఖీ చేయడానికి వెళ్లాను" అని ప్రదీప్ చెప్పగా, మేకను దొంగిలించడానికే వెళ్లాడని గ్రామస్థులు ఆరోపించారు. డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ రామ్ సింగ్ యాదవ్ మాట్లాడుతూ, ప్రదీప్‌పై ఎలాంటి కేసు నమోదు చేయలేదని, కానీ భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం చేయవద్దని గట్టిగా హెచ్చరించినట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో చిరుతను పట్టుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు.

# ఢిల్లీలో 1800 నకిలీ ఫోన్లు సీజ్

**ఐదుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని కరోల్ బాగ్‌లో అక్రమంగా మొబైల్ ఫోన్లు తయారు చేస్తూ, వాటి ఐఎంఈఐ నంబర్లను మారుస్తున్న ఓ భారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఓ ఇరుకైన సందులో నడుస్తున్న ఈ యూనిట్‌పై గురువారం దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 1800కు పైగా మొబైల్ ఫోన్లు, ఐఎంఈఐ నంబర్లు మార్చే సాఫ్ట్‌వేర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవలి కాలంలో సెంట్రల్ ఢిల్లీలో ఐఎంఈఐ ట్యాంపరింగ్‌కు సంబంధించి ఇదే అతిపెద్ద కేసు అని పోలీసులు తెలిపారు. పోలీసుల విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. పాత సామాన్ల వ్యాపారుల నుంచి పాత మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసి, వాటిలోని మదర్‌బోర్డులను వేరుచేసేవారని సెంట్రల్ డీసీపీ నిధిన్ వల్సన్ తెలిపారు. చైనా నుంచి కొత్త మొబైల్ బాడీలను దిగుమతి చేసుకుని, పాత మదర్‌బోర్డులతో కలిపి కొత్త ఫోన్లుగా అసెంబుల్ చేసేవారని వివరించారు. అనంతరం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉపయోగించి ఆ ఫోన్ల ఐఎంఈఐ నంబర్లను మార్చేసేవారని చెప్పారు. ఈ దందాను గత రెండేళ్లుగా కొనసాగిస్తున్నట్లు నిందితులు వెల్లడించారు. కరోల్ బాగ్‌లోని బీడన్‌పురా ప్రాంతంలో అనుమానాస్పద కార్యకలాపాలపై సుమారు 15 రోజులుగా నిఘా ఉంచిన పోలీసులు, కచ్చితమైన సమాచారంతో ఈ యూనిట్‌పై దాడి చేశారు. పోలీసులు లోపలికి ప్రవేశించేసరికి నిందితులు ల్యాప్‌టాప్ సాయంతో ఫోన్లను అసెంబుల్ చేస్తూ, ఐఎంఈఐ నంబర్లను మారుస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ దాడిలో 1,826 కీప్యాడ్, స్మార్ట్‌ఫోన్లు, ఐఎంఈఐ మార్చే సాఫ్ట్‌వేర్‌తో ఉన్న ల్యాప్‌టాప్, స్కానింగ్ పరికరం, వేలాది మొబైల్ విడిభాగాలు, ముద్రించిన ఐఎంఈఐ లేబుళ్లను పోలీసులు సీజ్ చేశారు. వారిపై బీఎన్ఎస్, ఐటీ చట్టం, టెలికం చట్టం 2023 కింద కేసు నమోదు చేశారు. ఈ రాకెట్ వెనుక ఉన్న సరఫరా చైన్, చైనా నుంచి విడిభాగాల కొనుగోలు, పంపిణీ నెట్‌వర్క్‌పై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## ఆల్ ఫలాహ్ వర్సిటీలో 18 లక్షల క్యాష్

న్యూఢిల్లీ: సుమారు 20 రోజుల క్రితం ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు కేసులో కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో ఆల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో అధికారులు రూ.18 లక్షల నగదును గుర్తించారు. ప్రస్తుతం ఎన్ఐఏ ఈ కేసును ముమ్మరంగా విచారిస్తోంది. ఆల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో అధికారులు ఇటీవల సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కీలక నిందితురాలైన షాహీన్ షహీద్ ఉన్న గదిలో నగదు లభ్యమైనట్లు జాతీయ మీడియా పేర్కొంది. ఈ నగదు మొత్తాన్ని వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కార్యకలాపాల కోసం ఉపయోగించేందుకే దాచిపెట్టినట్లు తెలుస్తోందని జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఎన్ఐఏ అధికారులు నిధులు ఎక్కడెక్కడ ఉన్నాయో అనే విషయంపై దృష్టి సారించారు. మరోవైపు, షాహీన్ ఎవరెవరితో సంబంధాలు కలిగి ఉందనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.

## తండ్రితో గొడవ.. సరిహద్దు దాటిన వ్యక్తి

**పాకిస్థాన్‌లో భారతీయుడి అరెస్టు**

లాహోర్: పాకిస్థాన్‌లోని పంజాబ్ పోలీసులు సరిహద్దులు దాటిన ఒక భారతీయుడిని అదుపులోకి తీసుకున్నారు. పొరపాటున అతడు తమ దేశంలోకి ప్రవేశించాడని వారు పేర్కొన్నారు. తండ్రితో జరిగిన వివాదం కారణంగా అతడు ఇంటి నుంచి వెళ్లిపోయి, సరిహద్దు దాటి పాకిస్థాన్‌లోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన మూడు నెలల క్రితం చోటు చేసుకున్నప్పటికీ, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాక్ భూభాగంలోకి ప్రవేశించిన భారతీయుడిని అరెస్టు చేసినట్లు పాకిస్థాన్ అధికారులు ధృవీకరించారు. అసోంకు చెందిన 31 ఏళ్ల బీజే సింగ్ ఆగస్టు 16న పంజాబ్ సరిహద్దును దాటి తమ దేశంలోకి ప్రవేశించాడని అక్కడి అధికారులు వెల్లడించారు. సరిహద్దు ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. బీజే సింగ్ దాదాపు 100 రోజులుగా తమ ఆధీనంలో ఉన్నాడని వారు పేర్కొన్నారు. విచారణ సందర్భంగా అతడి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో లాహోర్ నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాసూర్ పోలీస్ స్టేషన్‌కు అతడిని అప్పగించినట్లు అధికారులు తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా తండ్రి బర్షన్ సింగ్‌తో గొడవపడి ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు బాధితుడు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. అతడు తమ దేశంలోకి అక్రమంగా ప్రవేశించినందుకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## 48 గంటల్లో ముగ్గురు పిల్లలు మృతి

**తల్లిదండ్రులకు కడుపు కోత.. ఉత్తరప్రదేశ్‌లో ఘోర విషాదం**

లక్నో: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఓ గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జ్వరంతో ఒకే కుటుంబంలోని ముగ్గురు పిల్లలు మృత్యువాత పడ్డారు. ఒకే రకమైన లక్షణాలతో ముగ్గురు పిల్లలూ 48 గంటల్లోనే చనిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ విషయం తెలిసి ప్రభుత్వం అప్రమత్తమై వైద్య బృందాన్ని ఆ గ్రామానికి పంపించింది. ప్రస్తుతం గ్రామంలో చిన్నారులకు వైద్య పరీక్షలు జరుగుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. యూపీలోని నెబువా నౌరంగియా బ్లాక్‌లోని గులార్హియా తోలా గ్రామంలో పింటూ గౌర్ తన భార్య, ముగ్గురు పిల్లలతో నివసిస్తున్నాడు. వారం రోజుల క్రితం పింటూ గౌర్ పెద్ద కుమార్తె మంజు (7)కు జ్వరం వచ్చింది. స్థానిక వైద్యుడి వద్ద చికిత్స అందించినా బాలిక కోలుకోలేదు. దీంతో జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం చనిపోయింది. ఒకరోజు గడిచిన తర్వాత పింటూ గౌర్ మూడేళ్ల చిన్న కుమార్తె ఖుషి అస్వస్థతకు గురైంది. జ్వరంతో బాధపడుతున్న ఖుషిని తొలుత జిల్లా ఆసుపత్రికి, ఆ తర్వాత గోరఖ్ పూర్ లోని బీఆర్ డీ మెడికల్ కాలేజీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఖుషి కన్నుమూసింది. ఆ తర్వాత కొన్ని గంటలకే పింటూ గౌర్ కుమారుడు కృష్ణ (5) కూడా తీవ్ర జ్వరంతో చనిపోయాడు. ఉన్న ముగ్గురు పిల్లలనూ కోల్పోయిన పింటూ గౌర్ కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. ముగ్గురు చిన్నారుల మృతి నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వీరి మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి.. గ్రామంలోని మిగిలిన పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు.

## ప్రయాణికులపై జాగ్రత్తలేవి?

**ట్రావెల్ ఏజెన్సీలపై కఠినంగా ఉండాలి**

**బస్సు ప్రమాదాలపై ఎన్‌హెచ్చార్సీ.. రాష్ట్రాలకు కీలక ఆదేశాల జారీ**

న్యూఢిల్లీ: దూరప్రాంతాలకు వెళ్లే స్లీపర్ బస్సుల విషయంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్చార్సీ) రాష్ట్రాలకు కీలక సూచనలు జారీ చేసింది. వరుస బస్సు ప్రమాదాల నేపథ్యంలో ప్రయాణికుల భద్రతపై మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్న ట్రావెల్ ఏజెన్సీల పట్ల కఠినంగా వ్యవహరించాలని, రూల్స్ కు అనుగుణంగా లేని బస్సులను పక్కన పెట్టాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ఇటీవల జరిగిన కర్నూలు బస్సు ప్రమాదంతో పాటు దేశవ్యాప్తంగా పలుచోట్ల రన్నింగ్ బస్సుల్లో మంటలు ఎగిసిపడి ప్రయాణికులు చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదాల నేపథ్యంలో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పలువురు జాతీయ మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో తాజాగా మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ప్రైవేటు బస్సుల్లో భద్రతపై జాతీయ రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక సూచనలు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్లీపర్ బస్సులను పక్కన పెట్టేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు మార్గదర్శకాలు జారీ చేసింది.



## ఊపిరాడని ఢిల్లీ

**ప్రమాదకరంగానే వాయు కాలుష్యం**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. వరుసగా 15వ రోజు కూడా గాలి నాణ్యత 'వెరీ పూర్' (చాలా తక్కువ) కేటగిరీలోనే నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) శనివారం ఉదయం 7 గంటలకు విడుదల చేసిన డేటా ప్రకారం, ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 338గా రికార్డయింది. శుక్రవారం నమోదైన 385 ఏక్యూఐతో పోలిస్తే ఇది స్వల్పంగా మెరుగుపడినప్పటికీ, పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. నవంబర్ నెలలో దాదాపు ప్రతీరోజూ గాలి నాణ్యత ప్రమాదకర స్థాయిలోనే కొనసాగుతోంది. వాతావరణ పరిస్థితులు కాలుష్య కారకాలు చెదిరిపోవడానికి అనుకూలంగా లేనందున, రానున్న వారంలో కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని వాతావరణ ఏజెన్సీలు అంచనా వేస్తున్నాయి. శనివారం ఉదయం ఢిల్లీలోని ఆనంద్ విహార్ (354), అశోక్ విహార్ (347), బవానా (364), చాందినీ చౌక్ (351), ద్వారక సెక్టార్ 8 (368), ఐటీఓ (343) వంటి చాలా ప్రాంతాల్లో కాలుష్యం తీవ్రంగా ఉ ంది. అయితే ఐజీఐ ఎయిర్‌పోర్ట్ (295), దిల్షాద్ గార్డెన్ (272) వంటి కొన్ని చోట్ల మాత్రం గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలో నమోదైంది. ఢిల్లీని ఆనుకుని ఉన్న ఎన్‌సీఆర్ నగరాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నోయిడాలో ఏక్యూఐ 344, ఘజియాబాద్‌లో 333, గురుగ్రామ్‌లో 293గా రికార్డయింది. ఇదిలా ఉండగా, శనివారం పొగమంచు ఉంటుందని, గరిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 11 డిగ్రీల సెల్సియస్ వద్ద నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది.

## లవ్లీ చిత్రం



అనన్య పాండే



# అల్లరి నరేష్ ఆగం

రెండు దశాబ్దాల కెరీర్ లో తన కామెడీతో ప్రేక్షకులను అలరిస్తూ వచ్చిన అల్లరి నరేష్ రొటీన్ కామెడీ వర్క్ అవుట్ అవ్వట్లేదని గుర్తించి కాస్త కొత్తగా ట్రై చేయాలని సీరియస్ రోల్స్ కి 'నాంది'తో నాంది పలికాడు. మధ్యలో ఒకటి అర తన కామెడీ మార్క్ చూపించే ప్రయత్నం చేశాడు కానీ అవి వర్కౌట్ కాలేదు. నాంది తర్వాత అరడజను సినిమాల దాకా చేసిన అల్లరి నరేష్ కి రిజల్ట్ షాక్ ఇచ్చింది. రీసెంట్‌గా వచ్చిన 12 ఏ రైల్వే కాలనీ కూడా డిజాస్టర్ రిజల్ట్ ఇచ్చింది. ఈ రిజల్ట్ తో అల్లరి నరేష్ ఆలోచనలో పడ్డాడు. ప్రస్తుతం అల్లరి నరేష్ ఆల్కహాల్ సినిమా చేస్తున్నాడు. సైలెంట్‌గా షూటింగ్ పూర్తి చేసిన ఈ సినిమా రిలీజ్ డేట్ ని 2026 జనవరి 1న లాక్ చేశారు. అయితే, సంధి దశలో ఉన్న అల్లరి నరేశ్.. పోయిపోయి సంక్రాంతి వేళ సినిమా రిలీజ్ అవసరమా? అన్న మీమాంసలో పడ్డాడని తెలుస్తోంది. అందుకే జనవరి వదిలి నెక్స్ట్ ఒక మంచి సోలో రిలీజ్ డేట్ చూడాలని సితార నాగ వంశీ చూస్తున్నారట.

## తెలుగులో వారణాసి టైటిల్‌కు కొత్త పేరు?

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబోలో వస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా "వారణాసి" పై అంచనాలు మొదటి నుంచే ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే టైటిల్ రిలీజ్ చేసిన కొద్ది గంటల్లోనే అనుకోని వివాదం చుట్టుముట్టింది. ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం, ఈ సమస్యకు రాజమౌళి టీమ్ ఓ సొల్యూషన్ కనుగొన్నట్టుగా ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. "వారణాసి" టైటిల్‌ను అధికారికంగా ప్రకటించిన వెంటనే, రామ బ్రహ్మ హనుమ క్రియేషన్స్ అనే నిర్మాణ సంస్థ ఈ పేరును ముందే రిజిస్టర్ చేసుకున్నామని తెలిపింది. ఈ సంస్థకు చెందిన దర్శకుడు సీహెచ్. సుబ్బారెడ్డి కూడా ఇదే టైటిల్‌తో సినిమా చేయనున్నట్లు చాలాకాలంగా చెప్పినట్టు సమాచారందీంతో రాజమౌళి టీమ్‌కి చట్టపరమైన సమస్యలు వచ్చే అవకాశం ఉండటంతో, టైటిల్‌పై కీలక నిర్ణయం తీసుకున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, వివాదం పూర్తిగా తెలుగు వెర్షన్ టైటిల్‌కే సంబంధించినదట. అందువల్ల రాజమౌళి టీమ్ తెలుగులో టైటిల్‌ను స్వల్పంగా మార్చే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. హిందీ, తమిళం, కన్నడ, మలయాళంలో మాత్రం ఒరిజినల్ పేరు "వారణాసి" నే కొనసాగించే అవకాశం ఉంది.అంటే టైటిల్‌ను పూర్తిగా మార్చకుండా, తెలుగు మార్కెట్‌లో మాత్రమే స్వల్ప మార్పుతో సమస్యను పరిష్కరించాలని ప్లాన్ చేస్తున్నారు.






## 2 లక్షలకు అఖండ 2 టికెట్

నందమూరి బాలకృష్ణ హీరోగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'అఖండ 2' కోసం అభిమానులు ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఇప్పటికే ఓవర్సీస్‌కి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. అయితే జర్మనీలో నివసిస్తున్న బాలకృష్ణ ఎన్ఆర్ఐ అభిమాని ఒకరు ఈ సినిమా టికెట్‌ను ఏకంగా రూ. 2 లక్షలకు కొనుగోలు చేశారు. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు చెందిన ఎన్ఆర్ఐ అభిమాని రాజశేఖర పర్నపల్లి ఈ అసాధారణమైన పని చేసినట్లుగా తెలుస్తోంది. రెండు లక్షల రూపాయలు (రూ.2,00,000) చెల్లించి మరీ ఆయన 'అఖండ 2' సినిమా టికెట్‌ను కొనుగోలు చేశారు. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది.

## విజయం లేని 'కీర్తి'



సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ ఈ మధ్య వరుస ఫ్లాపులను ఎదుర్కొంటుంది. గత కొన్నాళ్లుగా కీర్తి నుంచి వచ్చిన ఏ సినిమాలూ తెలుగులో పెద్దగా ఆడటం లేదు. రీసెంట్ గా కీర్తి నటించిన రివాల్వర్ రీటా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మంచి అంచనాలతో రిలీజైన రివాల్వర్ రీటా కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేక పోయింది. స్వయంగా కీర్తి సురేష్ ఈ చిత్ర ప్రమోషన్స్ లో పాల్గొని సినిమాను ప్రమోట్ చేసినప్పటికీ అది కూడా ఏ మాత్రం మెరుగైన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. ఇంకా చెప్పాలంటే చాలా మందికి అసలు ఆ సినిమా ఒకటి రిలీజైంది అని కూడా తెలియదు. దానికి తోడు సినిమాలో కంటెంట్ కూడా పెద్దగా క్లిక్ అవకపోవడంతో రివాల్వర్ రీటా మొదటి రోజే డిజాస్టర్ గా నిలిచింది. రివాల్వర్ రీటా రిజల్ట్ తో కీర్తి మరోసారి తన ఖాతాలో ఫ్లాపును వేసుకుంది. దీంతో కీర్తి తనకు సక్సెస్ ఎప్పుడెప్పుడొస్తుందా అని ఎదురుచూస్తోంది. మొన్నామధ్య కీర్తి తెలుగులో చేసిన ఉప్పు కప్పురంబు సినిమా కూడా డైరెక్ట్ గా ఓటీటీలో రిలీజ్ కాగా, అది కూడా అంచనాలను అందుకోలేకపోయింది.



## బేబమ్మకు ఫ్లాపుల వరస

కృతిశెట్టి అలియాస్ బేబమ్మకు కూడా సంధి దశే నడుస్తోంది. ఆమె చేసిన సినిమాలేవీ ఆమెను ఆదుకోవడం లేదు. అయితే, ఈ బ్యూటీ తాజాగా రెండు తమిళ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతుంది. అవి రెండు ఒకే నెలలో విడుదల కానున్నాయి. కార్తీ హీరోగా నలన్ కుమార్ స్వామి దర్శకత్వంలో వా వాతయార్ తెరకెక్కిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం తెలుగులో అన్నగారు వస్తున్నారు టైటిల్ లో అనువాదమైంది. ఇందులో హీరోయిన్ గా కృతి శెట్టి నటించింది. ఈ చిత్రం అన్ని పనులు పూర్తి చేసుకుని డిసెంబర్ 5న చిత్రం రిలీజ్ కానుంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే కోలీవుడ్ యువ సంచలనం ప్రదీప్ రంగనాథ్ కి జోడీగా లవ్ ఇన్సురెన్స్ కంపెనీలోనూ కృతిశెట్టినే హీరోయిన్ గా నటించింది.



## నెక్స్ట్ లెవెల్‌లో పెద్ది యాక్షన్ సీన్స్..!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పెద్ది సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. బుచ్చి బాబు డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్ కలిసి నిర్మిస్తున్నారు. జాన్వి కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు ఏ.ఆర్.రెహమాన్ మ్యూజిక్ స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది. ఇప్పటికే పెద్ది నుంచి వచ్చిన ఫస్ట్ సాంగ్ చికిరి చార్ట్ బస్టర్ గా నిలిచింది. పెద్ది రిలీజ్ కి ముందే చికిరి సాంగ్ 110 మిలియన్ వ్యూస్ తో సెన్సేషనల్ అనిపించుకుంది. పెద్ది సినిమాలో కన్నడ స్టార్ శివ రాజ్ కుమార్ కూడా ఒక ఇంపార్టెంట్ రోల్ లో నటిస్తున్నారు. శివ రాజ్ కుమార్, చరణ్ సీన్స్ నెక్స్ట్ లెవెల్ లో ఉంటాయని తెలుస్తుంది. ఇక ఈ సినిమా యాక్షన్ కొరియోగ్రఫీ కోసం బాలీవుడ్ స్టార్ స్టంట్ మాస్టర్ శ్యామ్ కౌశల్ ని తీసుకొస్తున్నారట. దంగల్ నుంచి మొన్న రిలీజైన తేరే ఇష్క్ మైన్ సినిమా వరకు శ్యాం కౌశల్ తన యాక్షన్ కొరియోగ్రఫీతో యాక్షన్ ప్రియులను అలరిస్తూ వచ్చారు. పెద్ది సినిమా కోసం శ్యామ్ కౌశల్ ఆధ్వర్యంలో నవకాంత్ యాక్షన్ సీన్స్ కంపోజ్ చేస్తున్నారట. సినిమాలో ఈ యాక్షన్ సీన్స్ మూవీకే హైలెట్ అనిపించేలా ఉంటాయని టాక్.



## హద్దు దాటను

తెలుగు ఇండస్ట్రీలో రాశీఖన్నాకు వచ్చినన్ని అవకాశాలు మరే నటికి రాలేదు. జయాపజయాలతో సంబంధం లేకుండా అవకాశాలు అందుకుంది. మీడియం హీరోలకు పర్ఫెక్ట్ జోడీగా సెట్ అయింది. అందం, అభినయం అనే అర్హతలు మాత్రమే అమ్మడికి అవకాశాలు కల్పించాయి. నటిగా మాత్రం ఏ సినిమాలోనూ తనదైన ముద్ర వేసింది లేదు. మరి వాటి ఫలితాల సంగతేంటి? అంటే పని చేయడం వరకే తప్ప ఫలితం మాత్రం ఆశించొద్దు అన్నట్లే సాగింది. అయితే, తన సినిమా అవకాశాలపై, సినిమాల్లో ఎక్స్‌పోజింగ్‌పై ఈ అమ్మడు స్పందించింది. వెండి తెరపై బోర్డర్ దాటి నటించాల్సి వస్తే మాత్రం నో చెబుతానంది. సీన్ డిమాండ్ చేసిందని హద్దులు దాటి నటించాలనే ప్రపోజల్ వస్తే గనుక అలాంటి అవకాశాలు తనకు వద్దని నిర్మొహమాటంగా చెప్పేస్తానంది. నటిగా తాను మరీ అంతగా దిగజారి పని చేయాల్సిన అవసరం లేదంది. ప్రతీ నటికి ఓ కంఫర్ట్ జోన్ ఉంటుందని, ఈ విషయంలో ఎవర్నీ జడ్జ్ చేయకూడదన్నది తన అభిప్రాయంగా చెప్పుకొచ్చింది.



## 9 నెలల విరామం తర్వాత కోహ్లీ

సొంతగడ్డపై కోహ్లీ ఈ ఏడాది ఫిబ్రవరిలో చివరి వన్డే ఆడాడు. దాదాపు 9 నెలల విరామం తర్వాత తనదైన బ్యాటింగ్‌తో అభిమానులను రంజింపజేసేందుకు సిద్ధమవుతున్నాడీ రికార్డ్ బ్రేకర్. టెస్టు సిరీస్‌లో ఘోర పరాజయంతో డీలా పడిన జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపి.. అదిరే విజయాన్ని కట్టబెట్టాలని కోహ్లీ భావిస్తున్నాడు. అందుకే.. శనివారం నెట్స్‌లో అతడు అన్ని రకాల షాట్లు ఆడుతూ తన ఫుట్‌వర్క్ చాటుకున్నాడు. బ్యాక్‌ఫుట్‌లోనూ సాధన చేసిన కింగ్ కోహ్లీ.. త్రోడౌన్ బంతుల్ని సమర్థంగా ఎదుర్కొన్నాడు. కోహ్లీతో పాటు రోహిత్ శర్మ, కుర్రాడు యశస్వీ జైస్వాల్ సైతం నెట్స్‌లో చెమటోడ్చారు. శుభ్‌మన్ గిల్ గైర్హాజరీలో హిట్‌మ్యాన్‌తో కలిసి యశస్వీ ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు.



# రుతురాజ్‌కు చాన్స్!

**స్పెషలిస్ట్ బ్యాటర్‌గా పంత్?.. నేటి నుంచి భారత్-సౌతాఫ్రికా వన్డే పోరు**
**రాంచీ వేదికగా తొలి మ్యాచ్**

సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. ఆదివారం రాంచీ వేదికగా జరిగే తొలి వన్డేలో ఆతిథ్య భారత్, సౌతాఫ్రికా అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ మ్యాచ్ నేపథ్యంలో టీమిండియా తాత్కలిక కెప్టెన్ కేఎల్ రాహుల్ శనివారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా తుది జట్టు ఎంపికపై కీలక వ్యాఖ్యలు చేశాడు.

ఫైనల్ ఎలెవన్‌ను ఇంకా ఖరారు చేయలేదని ఆదివారమే తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పాడు. రిషభ్ పంత్, రుతురాజ్ గైక్వాడ్ ఆడే అవకాశాలపై కీలక వ్యాఖ్యలు చేశాడు. 'రుతురాజ్ గైక్వాడ్ అసాధారణమైన ఆటగాడు. మా టాప్ 5-6 డైనమిక్స్ చాలా స్థిరంగా ఉన్నాయి. కానీ రుతురాజ్ గైక్వాడ్ తనకు వచ్చిన అతి తక్కువ అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాడు. ఈ సిరీస్‌లో అతనికి



తప్పకుండా అవకాశం దక్కుతుంది. తొలి వన్డే తుది జట్టుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. మ్యాచ్‌కు ముందే ఫైనల్ చేయనున్నాం. రిషభ్ పంత్ స్పెషలిస్ట్ బ్యాటర్‌గా బరిలోకి దిగుతాడు. అయితే తొలి వన్డే అతను ఆడుతాడా? లేదా? అనేది ఇంకా నిర్ణయించలేదు. ఒకవేళ అతను ఆడితే కీపింగ్ చేస్తాడు. ఇప్పటి వరకు అయితే తుది నిర్ణయం తీసుకోలేదు. నేను ఆరో స్థానంలో బ్యాటింగ్ చేస్తాను. 'అని కేఎల్ రాహుల్ తెలిపాడు. స్పిన్ బౌలింగ్ ఆడటంలో భారత బ్యాటర్లు ఇబ్బంది పడుతున్నారనే విషయాన్ని కేఎల్ రాహుల్ అంగీకరించాడు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపాడు. 'అవును.. గత కొన్ని సిరీస్‌లుగా మేం స్పిన్ బౌలింగ్‌ను బాగా ఆడలేకపోతున్నాం. మాకు తెలుసు. ఈ విషయాన్ని మేం అంగకరిస్తున్నాం. బలహీనతలను గుర్తించడం బ్యాటర్ల పని. సీనియర్ ఆటగాళ్లతో మాట్లాడి ఈ బలహీనతను అధిగమించే ప్రయత్నం చేస్తాం. ఇప్పటికే మా బ్యాటింగ్‌ను మెరుగుపర్చుకునేందుకు కావాల్సిన మార్గాలను అన్వేషిస్తున్నాం. అయితే రాత్రికి రాత్రే మా బలహీనతను అధిగమించలేం.'అని రాహుల్ చెప్పుకొచ్చాడు.

### సౌతాఫ్రికాతో తొలి వన్డే తుది జట్టు(అంచనా)

రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్(కెప్టెన్), రిషభ్ పంత్/తిలక్ వర్మ, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా.

భారత వన్డే టీమ్: రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, కేఎల్ రాహుల్(కెప్టెన్), కీపర్, రిషభ్ పంత్(కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్ గైక్వాడ్, ప్రసిధ్ కృష్ణ, అర్షదీప్ సింగ్, ధ్రువ్ జురెల్.





## మన బ్యాటర్లకు అంత సీన్ లేదు

ప్రస్తుత టీమిండియా జట్టులో రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ లాంటి స్పెషలిస్ట్ టెస్ట్ బ్యాటర్లు లేరని క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ అన్నాడు. టీ20, వన్డేలు ఎక్కువగా ఆడటంతో క్రీజులో పాతుకుపోయి ఓపికగా ఆడే నైపుణ్యం భారత బ్యాటర్లకు లేకుండా పోయిందని అభిప్రాయపడ్డాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ అయిన సంగతి తెలిసిందే. ఈ ఘోర పరాజయంతో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో భారత్ జట్టు సంధి దశలో ఉంది. తాజాగా భారత జట్టు ప్రదర్శనపై స్పందించిన కపిల్ దేవ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ప్రస్తుతం భారత ఆటగాళ్లు ఎక్కువగా టీ20లు, వన్డే మ్యాచ్‌లు ఆడుతున్నారు. దాంతో బ్యాటర్లకు బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై ఆడే అవకాశం రావడం లేదు. స్పిన్, పేస్‌కు అనుకూలించే పిచ్‌లపై బ్యాటర్లు చాలా ఓపికగా ఆడాలి. అలాగే ప్రత్యేకమైన నైపుణ్యం కలిగి ఉండాలి. ప్రస్తుతం మన దగ్గర క్రీజులో పాతుకుపోయే రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ వంటి స్పెషలిస్ట్ బ్యాటర్లు లేరు. టెస్ట్‌ల్లో బ్యాటింగ్ అంటే క్రీజులో పాతుకుపోవడమే. స్పిన్, పేస్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రత్యేకమైన నైపుణ్యం ఉండాలి.

## టెస్టులకు బుమ్రా దూరంగా ఉండాలి

టెస్ట్ ఫార్మాట్‌కు టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా దూరంగా ఉండాలని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్



అశ్విన్ సూచించాడు. రెడ్ బాల్ క్రికెట్ కంటే వైట్‌బాల్ ఫార్మాట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్ ఆడిన బుమ్రాకు వన్డే సిరీస్ నుంచి విశ్రాంతినిచ్చిన సంగతి తెలిసిందే. అప్‌కమింగ్ టీ20 సిరీస్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా బుమ్రా గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఏబీ డివిలియర్స్‌తో మాట్లాడిన అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'నాకు బుమ్రాతో మంచి రిలేషన్ ఉంది. ప్రస్తుతం నేను అతని దగ్గరగా ఉండి ఉంటే.. బుమ్రాకు ఒకటే మాట చెప్పేవాడిని. పరిమిత ఓవర్ల క్రికెట్‌కు ప్రాధాన్యతమివ్వాలని సూచించేవాడని. మరీ అవసరమైతే తప్ప టెస్ట్ క్రికెట్ ఆడవద్దని సలహా ఇచ్చేవాడిని. కానీ అతనికి సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడటం అంటే చాలా ఇష్టమనే సంగతి నాకు తెలుసు. అతను వీలైనంత కాలం టెస్ట్ క్రికెట్ ఆడటానికే మొగ్గు చూపుతాడు. అది సవాల్‌తో కూడుకున్న విషయం అని కూడా తెలుసు. జస్‌ప్రీత్ బుమ్రా టీ20 క్రికెట్ ఆడాలి. అతను అర్థరహిత వన్డేలు ఆడాలని నేను కోరుకోవడం లేదు. టెస్ట్‌లు.. అది కూడా విదేశాల్లో జరిగే మ్యాచ్‌ల్లోనూ అతను ఆడాలని కోరుకుంటున్నా. టీమిండియా సొంతగడ్డపై ఆడుతున్నప్పుడు ఇతర ఫాస్ట్ బౌలర్ల సేవల్ని ఉపయోగించుకోవాలి.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

## పెళ్లి రద్దు వార్తలకు స్మృతి చెక్

**బయోలో దిష్టి రక్ష ఎమోజీ**



పెళ్లి వాయిదాపై వస్తున్న వార్తలకు టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన చెక్ పెట్టింది. తన ప్రియుడు, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్‌తో వివాహాన్ని పూర్తిగా రద్దు చేసుకున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించింది. స్మృతి, పలాశ్ ముచ్చల్ తమ ఇన్‌స్టాగ్రామ్ బయోలో దిష్టి రక్ష ఎమోజీలను చేర్చారు. తద్వారా తమకు ఎలాంటి సమస్యలు లేవనే విషయంపై క్లారిటీ ఇచ్చారు. నవంబర్ 23 జరగాల్సిన స్మృతి-పలాష్ వివాహం వాయిదా పడిన సంగతి తెలిసిందే. స్మృతి మంధాన తండ్రి గుండెపోటు లక్షణాలతో బాధపడటంతో పెళ్లిని వాయిదా వేశారు. ఆ తర్వాత ఈ పెళ్లికి సంబంధించిన పోస్ట్‌లు స్మృతి మందాన సోషల్ మీడియా ఖాతాల్లో మాయమయ్యాయి. ముఖ్యంగా పలాష్‌తో ఎంగేజ్‌మెంట్ ధ్రువీకరిస్తూ.. నిశ్చితార్థ రింగ్‌ను చూపిస్తూ స్మృతి పోస్ట్ చేసిన వీడియో కనిపించలేదు. ఈ వీడియోను సోషల్ మీడియా వేదికల్లో పంచుకున్న స్మృతి సహచరులు జెమీమా, శ్రేయాంక్ పాటిల్ కూడా తొలగించడంతో అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. కానీ ఈ వార్తలకు స్మృతి దిష్టి రక్ష ఎమోజీతో చెక్ పెట్టింది.

## డబ్ల్యూపీఎల్ షెడ్యూల్ రిలీజ్

**మొత్తం 22 మ్యాచ్‌లు.. ముంబై-ఆర్సీబీతో వేట మొదలు**



వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)2026 షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ప్రకటించింది. మొత్తం 22 మ్యాచ్‌ల వివరాలను శనివారం వెల్లడించింది. జనవరి 9న డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్, మాజీ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో జరిగే తొలి మ్యాచ్‌తో ఈ ధనాధన్ లీగ్‌కు తెరలేవనుంది. జనవరి 9 నుంచి ఫిబ్రవరి 5 వరకు నవీ ముంబై, వడదోర వేదికగా ఈ టోర్నీ జరగనుంది. వడదోర వేదికగా 11, నవీ ముంబై వేదికగా 11 మ్యాచ్‌లు జరగనున్నాయి. మొత్తం ఐదు జట్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో పాయింట్స్ టేబుల్‌లో 2, 3 వ స్థానంలో నిలిచిన జట్ల మధ్య ఫిబ్రవరి 3న ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. టేబుల్ టాపర్ నేరుగా ఫైనల్ చేరనుండగా.. ఎలిమినేటర్ విజేతతో ఫిబ్రవరి 5న టైటిల్ ఫైట్ జరగనుంది. ఇప్పటి వరకు జరిగిన మూడు సీజన్లలో ముంబై ఇండియన్స్ రెండు సార్లు విజేతగా నిలవగా.. ఆర్సీబీ ఒకసారి టైటిల్ అందుకుంది. గురువారం జరిగిన డబ్ల్యూపీఎల్ 2026 మెగావేలంలో భారత స్పిన్నర్ దీప్తి శర్మ అత్యధిక ధర పలికిన విషయం తెలిసిందే. దీప్తిని ఆర్‌టీఎమ్ కార్డ్ సాయంతో రూ. 3.20 కోట్ల భారీ ధరకు యూపీ వారియర్స్ కొనుగోలు చేసింది. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమేలియా కేర్‌ను రూ. 3 కోట్లకు ముంబై ఇండియన్స్, భారత ఆల్‌రౌండర్ శిఖా పాండేను రూ.2.40 కోట్లకు యూపీ వారియర్స్, కివీస్ ప్లేయర్ సోఫీ ఎకిల్ స్టోన్‌ను రూ.2 కోట్లకు గుజరాత్ జెయింట్స్ తీసుకున్నాయి. తెలుగు తేజం శ్రీ చరణిని ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.30 కోట్లకు తీసుకుంది. 77 స్థానాల కోసం జరిగిన ఈ మెగా వేలం 276 మంది ప్లేయర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఐదు ఫ్రాంచైజీలు మొత్తం 67 మంది ఆటగాళ్లను కొనుగోలు చేశాయి. ఇందు కోసం రూ.40.80 కోట్లు ఖర్చు చేశాయి.

## వెంకటేశ్ ప్రసాద్‌కు హైకోర్టు షాక్

కర్ణాటక క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న భారత మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్ కు షాక్ తగిలింది. ఏకగ్రీవంగా అతడు కేఎస్‌సీఏ బాస్‌గా ఎన్నికవ్వడం ఖాయం అనుకున్నవేళ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. రెండు రోజుల క్రితం ఎన్నికల అధికారి తిరస్కరించిన కే.ఎన్ శాంత్ కుమార్ నామినేషన్‌ను పునరుద్ధరించింది. దాంతో.. కర్ణాటక క్రికెట్ సంఘానికి డిసెంబర్ 7న జరుగబోయే అధ్యక్ష ఎన్నికల్లో ప్రసాద్, శాంత్ కుమార్ పోటీ పడనున్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రకారం నవంబర్ 30న కర్ణాటక క్రికెట్ సంఘానికి ఎన్నికలు జరగాలి. కానీ, ఎన్నికల నిర్వహణాధికారి డాక్టర్.బి. బసవరాజు (మాజీ ఐఏఎస్) క్రికెట్ సంఘం నిర్వహణ కమిటీ నుంచి స్పష్టత లేదని.. వెంటనే కోర్టు జోక్యం చేసుకోవాలని పట్టుపట్టారు. ఇరువురి వాదనలు విన్న జస్టిస్ సూరజ్ గోవిందరాజు ఎలక్షన్స్‌ను డిసెంబర్ 7న నిర్వహించాలని చెప్పారు. అధ్యక్ష పదవి కోసం గేమ్ ఛేంజర్స్ టీమ్ నుంచి వెంకటేశ్ ప్రసాద్, టీమ్ బ్రిజేశ్ నుంచి కే.ఎన్. శాంత్ కుమార్, కల్పన వెంకటాచార్ నామినేషన్ వేశారు. కానీ, సాంకేతిక కారణాలతో శాంత్ దరఖాస్తును ఎన్నికల అధికారి తిరస్కరించారు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
ఆదివారం 30-11-2025 | www.evarthalu.com




# బీసీలు అక్కలు ముక్కలు

బీసీలంతా ఒక్కటి అన్నారు..
రాజ్యాధికారం మనదే అన్నారు..
రాజకీయాలను శాసిస్తాం అన్నారు..
మరో కొత్త శకం మొదలైంది అన్నారు..
మేధావుల పోరాటాన్ని గుంజుకున్నారు..
తీరా.. అసలు టైంకి కాడి ఎత్తేశారు..
వీళ్లే బీసీ పెద్దలు.. అసలైన గద్దలు..
పోరాటాన్ని పెద్దల్లో కలిపిన సుద్దపూసలు..

ఒకామె బీసీ నినాదమెత్తుకుంటే జై కొట్టిండ్రు..
ఒకాయన 42% అనంగనే పాలు ఒల్కవోసిర్రు..
ఆహా.. ఓహో.. చారిత్రక నిర్ణయం అన్నరు..
ఒక్క దెబ్బకు బీసీల బతుకు మారిందన్నరు..
కోర్టులు ఊహూ.. అనంగనే తుస్సుమన్నరు..
కనీస పోరాటం మరిచి మూలుగుతున్నరు..
మళ్లీ అదే తంతు.. పెరగదిక బీసీల 'వంతు'..



## శ్రావణ వాణి



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, 9581291919

రిజర్వేషన్లు సాధించడంలో బీసీలు ఎందుకు ఫెయిల్ అవుతున్నారు? అంటే.. ఫస్ట్ ఆన్సర్ ఐక్యత లేకపోవడమే. ఇదే అన్ని రాజకీయ పార్టీలకు ఆయుధమైంది. ఆ ఆయుధాన్నే అన్ని పార్టీలు ప్రయోగిస్తున్నాయి. ఆశ పెట్టి, అత్యాశ చూపి.. అమాంతం ఆకాశం నుంచి విడిచిపెట్టేస్తేగానీ అర్థం కావడం లేదు. కులగణన సర్వే ప్రకారమే తీసుకుంటే.. రాష్ట్రంలో మొత్తంగా ఉన్న బీసీలు 56.33 శాతం (ముస్లింలతో కలిపి). ముస్లిమేతరులు 46.25 శాతం(1,64,09,179 మంది). అంటే బీసీలకు దక్కాల్సిన వాటా ఎంత? దక్కుతున్నదెంత? బీసీ నాయకులు డిమాండ్ చేస్తున్నదెంత? ప్రభుత్వాలు ఇస్తామంటున్నదెంత? ఈ విషయాలపై మాట్లాడేందుకు బీసీ నేతలకు నోరు రాదు. అడిగే అంత ధైర్యమూ చేయరు. ఒక నాయకుడు వచ్చి తాను బీసీల పక్షాన ఉంటానంటే.. పుల్లలు పెట్టే ప్రబుద్ధులు ఎందరో..! పెద్ద కులపోళ్లు 'నోడి కాడ ఇంత ముక్క' వేయంగానే సింగులు సర్దుకొని సప్పుడు చేయకుండా ఉన్న పరమనీచులు ఇంకెందరో..!

తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నం.9 జారీ చేసినప్పటికీ, అది న్యాయ సమీక్షను తట్టుకోలేకపోయింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలన్నింటికీ కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు. 42% రిజర్వేషన్లను అమలు చేయాలంటే, ఈ 50% పరిమితిని అధిగమించాల్సి వస్తుంది. దీనికి అనుగుణంగా చట్ట సవరణలు లేదా రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడం వంటి సంక్లిష్ట ప్రక్రియలు అవసరం. అయితే, ఈ న్యాయపరమైన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో ప్రభుత్వంతో పాటు, బీసీ సంఘాల నుంచి బలమైన, ఏకగ్రీవమైన న్యాయవాదన లోపించింది. రిజర్వేషన్ల సాధనలో బీసీలు ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు వారి మధ్య ఐక్యత లేకపోవడం. తెలంగాణలో అనేక బీసీ సంఘాలు, జేఏసీలు ఉన్నప్పటికీ, ఉమ్మడి లక్ష్యం కోసం ఒకే వేదికపైకి రావడం అరుదు. ప్రతి సంఘానికి ఒక నాయకుడు, వారి వెనుక కొందరు అనుచరులు, వారి వ్యక్తిగత రాజకీయ ఆకాంక్షలు ఉంటాయి. ఇది సామూహిక శక్తిని నీరుగారుస్తోంది. బీసీ నాయకులు వివిధ రాజకీయ పార్టీలలో కీలక స్థానాల్లో ఉన్నప్పటికీ, పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు తప్ప, తమ వర్గ ప్రయోజనాల కోసం పార్టీలకతీతంగా ఐక్యంగా పోరాడలేకపోతున్నారు. ఇక, బీసీల్లోనే వివిధ కులాల మధ్య అంతరాలు, ఆధిపత్య పోరాటాలు ఉన్నాయి. ఇది ఐక్య ఉద్యమానికి అడ్డుపడుతోంది. 'ఎవరికి వారు గొప్ప' అనుకునే వ్యక్తిగత అహంకారాలు, ఆధిపత్య ధోరణులు ఉద్యమాన్ని నీరుగారుస్తున్నాయి. బీసీల్లోని కొందరు నాయకులు తమ సొంత రాజకీయ ఎదుగుదల కోసం, పదవుల కోసం పాకులాడుతూ, బీసీ సామాజిక వర్గం మొత్తం ప్రయోజనాలను పణంగా పెడుతున్నారు. రాజకీయ పార్టీలు కూడా ఈ బలహీనతను తమకు అనుకూలంగా వాడుకుంటూ, బీసీ వర్గాలను చీల్చి, తమ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకుంటున్నాయి. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీ బలం బలహీనమైపోయిందని ఇప్పటికే ఓ క్లారిటీ వచ్చేసింది. ఇది బీసీలకు అవమానం. బీసీ నాయకులకు ఘోర పరాభవం. ప్రభుత్వాన్ని గడగడలాడిస్తాం.. రాష్ట్రాన్ని స్తంభింపజేస్తాం.. మొత్తం అల్లకల్లోలం సృష్టిస్తాం.. అని బీరాలు పలికినవాళ్లు పిచ్చోళ్లైపోయారు. అసలే ఐకమత్యం అంటే ఆమడదూరం ఉండేవాళ్లు బీసీలు. అలాంటి బీసీలను నమ్మి ముందుకు దూకడం సాహసమే. ఆ సాహసానికి పూనుకున్న మేధావులు ఇప్పుడు ఆలోచనలో పడ్డారు. ఈ రాజకీయ నాయకుల వల్ల ఏమీ కావడం లేదని తమ వంతుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. బీసీల్లో చైతన్యాన్ని కలిగించేందుకు ట్రై చేస్తూనే ఉన్నారు.

ఇప్పటికైనా బీసీ ఉద్యమ తీరు మారాలి. కుక్కకు బొక్కేసినట్లు పార్టీలు హామీలు గుప్పించగానే తోక ఊపుకుంటూ పోయే బీసీ నాయకులు తమ తీరు మార్చుకోవాలి. ఒక బీసీ నాయకుడికి అధికారం వస్తే బీసీలు బాగుపడ్డట్లు కాదు. బీసీలంతా బాగుపడాలంటే.. బీసీలంతా ఏకమవ్వాలి అన్న నిజాన్ని గుర్తించనన్ని రోజులు ఇదే పరిస్థితి. కాబట్టి.. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలను, అహంకారాలను వీడి, ఉమ్మడి లక్ష్యం – 42% రిజర్వేషన్ల సాధన కోసం పార్టీలకతీతంగా ఐక్య పోరాటం చేయాలి. లేదంటే, రాజ్యాధికారంలో తగిన ప్రాతినిధ్యం లేక, దశాబ్దాలుగా వెనుకబాటులోనే మగ్గిపోవాల్సి వస్తుంది. వివిధ కుల సంఘాలు, ఉప-కుల సంఘాలు, మరియు రాజకీయ పార్టీలకతీతంగా బీసీలందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలి. ఒక శక్తివంతమైన వేదికను ఏర్పాటు చేయాలి. తమ జనాభా బలం గురించి, రాజ్యాధికారంలో తమకున్న హక్కుల గురించి బీసీ వర్గాలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి. 'మన జనాభా వాటా 60% ప్లస్, రాజకీయ వాటా ఎంత?' అనే ప్రశ్నను ప్రతి బీసీలో కలిగేలా చేయడంలో విఫలం అవుతున్నారు. దానిపై దృష్టి పెట్టాలి. బీసీ మేధావులు, న్యాయవాదులతో కూడిన ఒక బలమైన న్యాయ పోరాట కమిటీని ఏర్పాటు చేయాలి. సదస్సులు, ప్రెస్ మీట్‌లకే పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ధర్నాలు, సభలు, రోడ్ల దిగ్బంధం వంటి కార్యక్రమాలను నిర్వహించాలి. ఈ ఉద్యమాలలో అన్ని వర్గాల భాగస్వామ్యాన్ని ఆహ్వానించాలి. యువతలో, మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి శిక్షణ తరగతులను, వర్క్‌షాప్‌లను నిర్వహించాలి. భవిష్యత్ రాజకీయాలకు బీసీ నాయకులను సిద్ధం చేయాలి. పార్టీలకతీతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిరంతరం ఒత్తిడి పెంచాలి.

## కోర్టులవి మోసాలు కావా?

ఎస్సీలు: 15 శాతం
ఎస్టీలు: 7.5 శాతం
ఓబీసీలు: 27 శాతం
(కలిపితే: 49.5 శాతం)
ఈడబ్ల్యూఎస్: 10 శాతం
మొత్తం: 59.5 శాతం

అంటే.. రిజర్వేషన్లు 59.5 శాతానికి చేరినట్లే కదా. చట్టాన్ని ఓ సారి పరిశీలిస్తే.. ఆర్థికంగా వెనుకబడిన ఓసీలను ఆదుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం 2019 లో 103వ రాజ్యాంగ సవరణ ద్వారా 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తెచ్చింది. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలు పొందుతున్న రిజర్వేషన్లలో ఎటువంటి మార్పు లేకుండా ఈ చట్టం రూపొందించారు. అంటే.. ఓపెన్ నుంచి 10 శాతం కల్పించాలి. కానీ, ఇక్కడో కిటుకు ఉంది.. ఈడబ్ల్యూఎస్ కింద ఓపెన్ నుంచి 10 శాతం రిజర్వేషన్ కల్పించడం కాదు.. 100 శాతంలో 10 శాతం రిజర్వేషన్ ఈడబ్ల్యూఎస్ కింద అమలు చేయడం అన్నమాట. వివరంగా చెప్పాలంటే.. ఓపెన్ క్యాటగిరీ కింద ఓసీలకు 5 ఉద్యోగాలు వస్తే.. మొత్తం వంద శాతానికి ఈడబ్ల్యూఎస్ అమలు చేయడం ద్వారా 10 ఉద్యోగాలు ఓసీలు లాక్కెళ్లిపోవడం అన్నమాట. ఈ సారాంశాన్ని బట్టి కోర్టులు కూడా బీసీలపట్ల పక్షపాతాన్ని ప్రదర్శిస్తున్నాయని అర్థం అవుతోంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దు అని అడ్డుపుల్ల వేస్తున్నది. మరి.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించే సమయంలో కోర్టులకు సీలింగ్ ఎందుకు గుర్తురావడం లేదో మరి. సరేపోనీ.. మన బీసీ నాయకులకు దాన్ని గుర్తు చేయడం రావట్లేదో?

### బీసీ రిజర్వేషన్లను నీరుగారుస్తున్నవి..

- పార్టీలకు అతీతంగా నిలవలేకపోవడం
- నాయకుల్లో, ప్రజల్లో ఐక్యత లేమి
- ఎవరికి వారు గొప్ప అనుకోవడం
- మా కులం అంటే మా కులం గొప్ప అనుకోవడం
- భజిత నాయకత్వం

## వేరు కుంపట్లు పోవాలి

బీసీ నాయకులది పూటకో మాట అన్నట్లుగా ఉంది పరిస్థితి. ఎవరికి వారు తామే గొప్ప అన్న రీతిలో ప్రవర్తిస్తూ బీసీ ఉద్యమాన్ని నీరుగారుస్తున్నారు. 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించగానే ప్రభుత్వ పెద్దలను ఆకాశానికి ఎత్తేశారు కొందరు. అసలు నిజం తెలిసి సైలెంట్ అయిపోయారు. ఇది కాదు ఒక ఉద్యమానికి ఉండాల్సిన లక్షణం. ప్రకటనతోనే ఉద్యమం ఆగిపోకూడదు. లక్ష్యం చేరుకొనేదాకా నిరంతర శ్రమ ఉండాలి. దానికి తగ్గ ప్రణాళిక ఉండాలి. క్రమశిక్షణ కలిగిన నాయకత్వం ఉండాలి. అంటే.. బీసీలకు బీసీల్లో కేసీఆర్ లాంటోడు కావాలి. నాయకుడు చెప్పిన మాట విందాం.. ఆయన బాటలో నడుద్దాం.. అన్న గౌరవం ఉండాలి. చిన్నపాటి భేదాభిప్రాయాలకే వేరు కుంపటి పెట్టాలన్న స్వార్థం పోవాలి. స్వార్థం ఉన్నా ఉద్యమానికి ఎలా ఉపయోగపడుతుంది? అన్న కోణంలో ఆలోచన రావాలి. అప్పుడే బీసీ ఉద్యమం ఉగ్రరూపం దాల్చుతుంది. అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని దహించివేస్తుంది.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.